
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 13 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	180	200
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 19.4

ఇక్కడ శిక్షణతో.. యువత సెట్‌విన్



నల్లగొండ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థ

● 26 కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు నల్లగొండలో సెట్విన్ కేంద్రం ● కంప్యూటర్స్, ఫ్యాషన్‌డిజైనింగ్, బ్యూటీషియన్, టెక్నికల్ విభాగాల్లో కోర్సులు

నల్లగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా యువతకు ఉపాధి కల్పన కోర్సులనందించేందుకు సెట్విన్ శిక్షణా కేంద్రం సిద్ధమైంది. 26 రకాల కోర్సుల్లో ఇక్కడ నిరుద్యోగ యువతకు శిక్షణ అందించేందుకు రంగం సిద్ధమైంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఏడో తరగతి నుంచి ఇంటర్‌వరకు మాత్రమే చదివి సరైన ఉపాధిలేక ఇబ్బందిపడే యువతకు ఈ కోర్సుల్లో శిక్షణ పొందడం ద్వారా తక్షణ ఉపాధి పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణనందించే నిమిత్తం 1978లో ఏర్పాటైన సెట్విన్ 26వ శిక్షణా కేంద్రాన్ని ఇటీవల నల్లగొండలో ప్రారంభించింది. జిల్లాలో యువత, నిరుద్యోగులు చెడుమార్గం పట్టకుండా, స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకునేందుకు ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలో..

మిగతా 7వ పేజీలో..



నల్లగొండ జిల్లాకేంద్రంలోని సెట్విన్ సెంటర్‌లో సిద్ధం చేసిన కారు రిపేర్ సామగ్రి



నల్లగొండ జిల్లాకేంద్రంలో సమ్మెలో పాల్గొన్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు

స్తంభించిన విద్యాశాఖ

- సమగ్రశిక్షకుల సమ్మె కారణం
- కనీస డిమాండ్లు పరిష్కరించాలంటున్న శిక్షకులు
- ఇలాగే కొనసాగితే కేజీబీవీలు మూతవేయాల్సిందే

విద్యాశాఖకు వెన్నెముక లాంటి సమగ్రశిక్ష అభియాన్ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉద్యోగభద్రత కల్పించాలని సమ్మెకు దిగడంతో పాలన స్తంభించింది. వారం రోజులుగా నిరవధికంగా ఆందోళనలు, ధర్నాలు, సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం వీరిని చర్చలకు పిలవలేదు. దీంతో సమ్మె ఉధృతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మెతో విద్యాశాఖలో ఎక్కడికక్కడ ఫైళ్లు నిలిచిపోయాయి. మండల రిసోర్స్ కేంద్రాలు, భవిత్ కేంద్రాలు మూతపడ్డాయి. కేజీబీవీలలో విద్యాబోధన కుంటుపడింది. అదేవిధంగా స్కూల్ కాంప్లెక్స్‌లో సీఆర్పీలు లేక ఏ పనులూ జరగడం లేదు. పాఠశాలల్లోనూ ఆర్ట్ టీచర్లు, పీఈటీలు లేరు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మొత్తం విద్యాశాఖ స్తంభించే పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. అయితే సమ్మెకు దిగిన సమగ్రశిక్షకులు మాత్రం వారి న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఈ మేరకు హామీ కూడా ఇచ్చిందని, ఇప్పుడు దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని, వాటిని నెరవేర్చకుంటే సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

జిల్లా కార్యాలయం మొదలు పాఠశాల స్థాయి వరకు

సమగ్రశిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు విద్యాశాఖలో జిల్లా కేంద్ర కార్యాలయాలు మొదలు పాఠశాలస్థాయి వరకు వివిధ విభాగాల్లో పని చేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టమ్ ఎనలిస్టులు, టెక్నికల్ పర్సన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డీఎల్ఎంటీలు, మెసెంజర్లు విధులు నిర్వహిస్తున్నారు. డీఈవో కార్యాలయం మొదలు ఆయా అనుబంధ కార్యాలయాల్లో వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. మండల స్థాయిలో మండల విద్యావనరుల కేంద్రాలు, భవిత కేంద్రాల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్‌పీలు, మెసెంజర్లు పనిచేస్తున్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లలో క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలల్లో ఆర్ట్ టీచర్లు, పీఈటీలు, వర్క్ ఎడ్యుకేషన్ వలంటీర్లు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లుగా సేవలందిస్తున్నారు. అదేవిధంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో స్పెషలాఫీసర్లు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, క్రాఫ్ట్, కంప్యూటర్

మిగతా 7వ పేజీలో...

కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలి



అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 సెప్టెంబరు 13న నాటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో మా ధర్నా శిబిరం వద్దకు వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగభద్రత కల్పిస్తామన్నారు. ఆ హామీని అమలు చేయాలని కోరుతున్నాం. మా సమస్యలపై అవగాహన ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మా డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్నాం.

ఎం.కృష్ణ, తెలంగాణ సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

మంత్రి కోమటిరెడ్డి సారథ్యంలో

పట్టణాభివృద్ధి



- నెంబర్‌వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఏడాదిలో సరిచేశాం
- తాగునీరు, సీసీరోడ్లు, విద్యుత్, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు కసరత్తు
- నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సారథ్యంలో నల్లగొండ మునిసిపాలిటీని ఉత్తమ నివాసయోగ్య పట్టణంగా మార్చే ప్రక్రియను చేపట్టాం.. స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, మెరుగైన పారిశుధ్య నిర్వహణతో పాటు పట్టణ ప్రజలకు అవసరమైన అంతర్గతరోడ్లు, డ్రైనేజీలు, 24 గంటల నాణ్యమైన విద్యుత్, మెరుగైన పౌరసేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.. అంటున్న నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో విశేషాలు ఇలా...

● పట్టణంలో మంత్రి సహకారంతో 60రోజుల్లో రూ.5కోట్ల వ్యయంతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మరో సబ్‌స్టేషన్ కూడా నిర్మాణంలో ఉంది.

● మర్రిగూడ బైపాస్ వద్ద ఫ్లైఓవర్‌బ్రిడ్జి పనులు నామ్ చేపడుతోంది. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు జాప్యమయ్యాయి. రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా వెంకట్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక నామ్ ప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించి రూ.30కోట్ల బిల్లులు మంజూరు చేయించారు. పనులను వేగవంతంగా సాగేలా పర్యవేక్షణ చేస్తున్నారు. ఒకటి, రెండు నెలల్లో ఈ పనులు పూర్తిచేసి ప్రారంభించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

● పానగల్ ఫ్లైఓవర్ వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిచేశాం. రూ.5కోట్లతో ఇక్కడ ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ వినియోగించి డ్రైనేజీ పనులు యుద్ధప్రాతిపదికన

మిగతా 8వ పేజీలో...

ఏబీటీవో అంతర్జాతీయ అధ్యక్షుడిగా లక్ష్మయ్య



బీహార్ రాష్ట్రంలోని వైశాలిలో జరిగిన సదస్సులో ఏబీటీవో అంతర్జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేపల్లి లక్ష్మయ్యను అభినందిస్తున్న నిర్వాహకులు

నాగార్జునసాగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బుద్ధిస్ట్ టూర్స్ ఆపరేటర్స్ అసోసియేషన్ (ఏబీటీవో) అంతర్జాతీయ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త మల్లేపల్లి లక్ష్మయ్య నియమితులయ్యారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీవరకు బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా కేంద్రంలో జరిగిన 7వ ఏబీటీఓ అంతర్జాతీయ సదస్సులో అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం ప్రత్యేక అధికారిగా ఉన్న సమయంలో బౌద్ధమత వ్యాప్తికి లక్ష్మయ్య చేసిన కృషికి గుర్తింపుగా ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2015వ సంవత్సరంలో బీహార్ రాష్ట్రంలోని నలందలో ఏబీటీవో ప్రధాన కార్యాలయం ఏర్పాటుచేశామని, బౌద్ధ పర్యాటకాన్ని ప్రోత్సహించడం, సాంస్కృతిక వారసత్వాన్ని పర్యవేక్షించడం ప్రధాన ఉద్దేశ్యమని సంస్థ నిర్వాహకులు చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన ఏబీటీఓ వ్యవస్థాపకుడు డాక్టర్ కౌలేష్‌కుమార్‌కు మల్లేపల్లి లక్ష్మయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

● కనకమహాలక్ష్మీగా..



కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు మార్గశిర మాసం గురువారం పురస్కరించుకుని కనకమహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చీరసారె, ఒడిబియ్యం, బోన నైవేద్యాలను సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.

● ఆంధ్రజ్యోతి, కనగల్

ఎగుమతులపై దృష్టి సారించాలి : కలెక్టర్

నల్లగొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎగుమతులకు అనువైన ఉత్పత్తులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎగుమతులకు అనువైన ఉత్పత్తులు, క్లస్టర్ల అభివృద్ధికి అనువైన పరిస్థితులను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎగుమతుల విషయంలో స్వయం సహాయక మహిళా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తామని, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలు ఉత్పత్తుల విషయంలో ముందుకు వస్తే వారికి అవసరమైన భూమిని తక్కువ ధరకు ఇస్తామని తెలిపారు. ఎఫ్ఐఈవో కులకర్ణి మాట్లాడుతూ, ఎగుమతులకు అనువైన పరిశ్రమల ఏర్పాటు గురించి, వాటి విధానాలను వివరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్, హార్టికల్చర్ డీడీ సాయిబాబా, కట్టంగూరు ఎఫ్‌టీవో అధ్యక్షుడు నంద్యాల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కనగల్‌లో జెండా ఊపి 108 వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

108 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): ప్రభుత్వం మంజూరు చేసిన 108 వాహనాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం కనగల్ పీహెచ్‌సీలో 108 అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అత్యవసర ప్రమాద సమయాల్లో బాధితులను ఆసుపత్రికి తరలించడమే అంబులెన్స్ సిబ్బంది ప్రధాన లక్ష్యమన్నారు. కొత్త వాహనంలో అధునాతన వైద్య సౌకర్యాలు ఉన్నాయన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన నూతన భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాతభవనం నుంచి కొత్త భవనంలోకి మారేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు వ్యవసాయ సబ్ మార్కెట్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, వైద్యుడు రామకృష్ణ, ఆర్‌ఐలు సునిత, యాదగిరి, తదితరులున్నారు.

ఉమ్మడి జిల్లాలో బైక్ ట్యాక్సీలు

రయ్ రయ్



ఇన్నాళ్లు నగరాలకే పరిమితమైన ర్యాపిడో సౌకర్యం జిల్లాకేంద్రాలకు చేరువైంది. అత్యవసర సమయంలో, అడ్రస్ తెలియని వాళ్లకు అత్యంత ముఖ్యమైన ఈ ర్యాపిడో వాహన సౌకర్యం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదలైంది.

6

ఉత్సవాలను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వంద వసంతాల ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 30న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చెన్నారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీపీఐ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. ఎస్ఎల్‌బీసీ, పెండ్లిపాకల ప్రాజెక్టు, కిష్టరాయన్‌పల్లి ప్రాజెక్టు పనులను ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, కల్లు చరణ్‌రెడ్డి, వీరస్వామి, పరిపూర్ణచారి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

రేపు బీసీల రౌండ్ టేబుల్ సమావేశం

నల్లగొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నేపథ్యంలో బీసీల భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వీరేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ నాయకులను పెద్ద సంఖ్యలో గెలిపించుకునేందుకు బీసీ రాజ్యాధికార సమితి క్షేత్ర స్థాయిలో గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి వరకు ఇన్‌చార్జీలను నియమించనున్నట్లు తెలిపారు. 14న నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ హాజరువుతున్నారని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ కర్నాటి యాదగిరి, మార్గం సతీష్‌కుమార్, లింగంపల్లి చిరంజీవి, కొడుపుగంటి శ్రీధర్, గడగోజు విజయచారి, కర్నాటి జితేందర్, చిన్నోజు రాజు, దీకొండ నవీన్‌కుమార్, ఖమ్మం అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో బైక్ ట్యాక్సీలు
రయ్..రయ్...

● అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వీరనాగేందర్ స్వామి జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో పనిఉండడంతో సూర్యాపేటకు వచ్చాడు. కలెక్టరేట్ తెలియకపోవడం, తన వద్ద వాహనం లేకపోవడంతో రాపిడో యాప్ ద్వారా బైక్ బుక్ చేసుకోగా కొద్దినిమిషాల్లోనే బైకర్ వచ్చి వీరనాగేందర్‌స్వామిని కలెక్టరేట్‌కు తీసుకెళ్లాడు.

● సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన రాజు ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతను రాపిడో కెప్టెన్ యాప్ ద్వారా ఖాళీ సమయంలో ప్రయాణికులను చేరవేస్తు అదనపు ఆదాయం పొందుతున్నాడు.


పైరెండు సంఘటనల్లో ఒకరికి ఉపాధి లభిస్తుండగా, మరకొరు ప్రయాణ ఇబ్బందుల్లేకుండా గమ్యస్థానం చేరుకున్నారు. దీంతో ఇద్దరికీ మేలు జరుగుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రాపిడో యాప్ తెచ్చిన సౌకర్యంతో ఇది సాధ్యమైంది.



● అందుబాటులోకి రాపిడో బైక్ టాక్సీ
● ప్రయాణికులకు సౌకర్యం
● కొత్త ఉపాధితో యువతకు మేలు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

నగరాలకే ప్రాంతాలకే పరిమితమైన బైక్ ట్యాక్సీ సర్వీసులు ఇప్పుడు జిల్లాకేంద్రాలకు విస్తరించాయి. తాజాగా రాపిడో(రోపెన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్) సర్వీసులు ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట పట్టణాల్లోనూ అందుబాటులోకి వచ్చాయి. వీటి రాకతో ప్రజలకు ఎంతో సౌకర్యవంతమైన సేవలు అందుతున్నాయి. ఒకచోటు నుంచి మరో చోటుకు ప్రయాణానికి బస్సులేదా ఆటో, సొంత వాహనం అవసరం. ప్రస్తుతం రాపిడో యాప్‌తో బైక్, ఆటో సేవలు అందుబాటులోకి వచ్చాయి. వీటి రాకతో నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతోంది. పార్ట్‌టైం ఉద్యోగులకు ఇది ఎంతో కొంత ఆదాయ వనరుగా మారింది. అయితే ఈ బైక్ ట్యాక్సీ సేవలు అందుబాటులో ఉన్నా చాలా మందికి తెలియకపోవడంతో సర్వీసులు అంతంతమాత్రంగానే అందుతున్నాయి.



భువనగిరి రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు, నల్లగొండ సమీపంలోని ఛాయా సోమేశ్వరాలయం నుంచి బస్టాండ్ వరకు బుకింగ్ క్లిపింగ్స్

ఉపాధి లభిస్తోంది



రాపిడో కెప్టెన్ యాప్ ద్వారా ఉపాధి లభిస్తోంది. నేను ఓ కంప్యూటర్ కార్యాలయంలో పనిచేస్తున్నా. ఖాళీ సమయంలో ఆర్డర్ వస్తే వెళ్తుంటా. రోజుకు రూ.300 దాకా సంపాదిస్తున్నా. ప్రజలు పూర్తిస్థాయిలో సేవలు తీసుకోవడం లేదు. బైక్ ట్యాక్సీలపై స్థానికుల్లో మరికొంత అవగాహన పెరగాల్సి ఉంది.

రాకేష్, సూర్యాపేట రాపిడో డ్రైవర్

తక్కువ సమయంలో గమ్యస్థానాలకు..

సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి రాపిడో సేవలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని 100 కిలోమీటర్ల వరకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా రాపిడో యాప్ ద్వారా ప్రయాణికుడు బైక్ గాని ఆటో కానీ బుక్ చేసుకుంటే ఇంటి వద్దకే లేదా ప్రయాణికుడు ఉన్న చోటుకే వాహనం రావడంతో అనుకున్న గమ్యస్థానానికి వెళ్లడం సులభమవుతోంది. రాపిడోలో బుక్ చేసుకున్న బైక్‌కు కిలోమీటర్‌కు రూ.6 చెల్లించాల్సి ఉంటుంది. అదే ఆటో అయితే సుమారుగా రూ.12 చెల్లించాల్సి ఉంటుంది. అనుకున్న సమయానికి గమ్యస్థానం చేరే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా యాదగిరిగుట్ట వంటి ప్రధాన క్షేత్రాల్లోనూ రాపిడో సేవలు అందుబాటులోకి రావాలని భక్తులు కోరుతున్నారు.


ఉపాధి మార్గం

సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన అనేకమంది నిరుద్యోగ యువత ఈ రాపిడో యాప్ ద్వారా ఆదాయం పొందుతున్నారు. ముఖ్యంగా చిన్నచిన్న ఉద్యోగాలు లేదా ప్రైవేట్ కంపెనీలలో పనిచేసే యువత పార్ట్‌టైంగా రాపిడో యాప్ ద్వారా ప్రయాణికులను చేరవేసి ఆదాయం పొందుతున్నారు. ముందుగా యువత రాపిడో కెప్టెన్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వాహన వివరాలు, లైసెన్స్, మొబైల్ నెంబర్లను పొందుపర్చాలి. ఎవరైతే ప్రయాణికుడిగా దగ్గరగా ఉంటారో వారికి మెసేజ్ వెళ్లడంతో క్షణాల్లో అక్కడి వెళ్లి ప్రయాణికుడిని గమ్యస్థలం చేర్చవచ్చు. ఒక్కొక్క బైక్ డ్రైవర్ రోజుకు మూడు నుంచి నాలుగు గమ్యస్థానాలకు వెళ్తున్నారు. వీరు రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకు సంపాదిస్తున్నారు. అదే ఫుల్ టైం పనిచేసేవారు రోజుకు రూ.400 వరకు సంపాదించే అవకాశం ఉంది. అయితే వీరంతా ఆ ఆదాయాన్ని నగదును వారంలో రెండుసార్లు మాత్రమే తమ ఖాతాలో నుంచి డ్రా చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రయాణికుడికి, డ్రైవర్‌కి రక్షణ

రాపిడో యాప్ ద్వారా ప్రయాణికుడికి అదేవిధంగా డ్రైవర్ ఇద్దరికీ రక్షణ ఉంటుంది. బైక్‌పై గమ్యస్థానానికి వెళ్లే సమయంలో డ్రైవర్ ఎలాంటి ఇబ్బంది పెట్టినా, అదేవిధంగా ప్రయాణికుడు డ్రైవర్‌కు ఇబ్బందిపెట్టినా యాప్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చు. వెంటనే సంబంధికులు స్పందిస్తారు. అయితే రాపిడో సేవలు జిల్లా కేంద్రం నుంచి 100కిలోమీటర్లకు విస్తరించినప్పటికీ జిల్లా కేంద్రం నుంచి ఉన్నాయే తప్ప అక్కడి నుంచి జిల్లాకేంద్రానికి లేకపోవడంతో ఇబ్బందిగా మారుతుంది.

రాపిడోతో మేలు



రాపిడో సేవలతో ఎంతగానో మేలు జరుగుతోంది. ఇటీవల ప్రైవేట్ కళాశాలకు వెళ్లాల్సి ఉండగా అడ్రస్ తెలియకపోవడంతో రాపిడోతో కళాశాలకు చేరుకున్న. ట్రాఫిక్ సమస్యలు ఉన్నా సకాలంలో గమ్యానికి చేరుకున్నాం. తక్కువ చార్జీతో సేవలు ఉన్నాయి. సూర్యాపేట నుంచి 20 కిలోమీటర్ల వరకు పోతున్నాం కానీ అక్కడి నుంచి తిరిగి రావడానికి రాపిడో సేవలు లేకపోవడం నిరాశ కలిగిస్తోంది.

సూరారపు ప్రేమ్‌కుమార్, నూతనకల్

రవాణా రంగ సమస్యలపై
పార్లమెంటులో చర్చించాలి



త్రిపుర మాజీ సీఎంతో రాష్ట్ర లారీ అసోసియేషన్ ఛైర్మన్ రామినేని శ్రీనివాసరావు

కోదాడ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా రవాణారంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని రాష్ట్ర లారీ అసోసియేషన్ ఛైర్మన్ రామినేని శ్రీనివాసరావు కోరారు. సూర్యాపేట జిల్లా కోదాడకు ఓ వివాహ వేడుకకు వచ్చిన త్రిపుర రాష్ట్ర మాజీ సీఎం, ప్రస్తుత ఎంపీ బిప్లబ్ కుమార్‌దేవ్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. రవాణా సంఘం సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పెరిగిన డీజిల్, పెట్రోల్, ధరలు ఇన్సూరెన్స్ ప్రీమియంలు, టోల్‌గేట్ ధరలతో కూడా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. 15 ఏళ్ల కాలపరిమితి తర్వాత వాహనాలను రద్దు చేయడంతో పలువురు యజమానులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, అన్ని సమస్యలపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం కోదాడకు వచ్చిన సందర్భంగా వారిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రహ్మం, కే ప్రసాద రెడ్డి, పీ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

తల్లి ఒడికి చేరిన శిశువు

భువనగిరి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో శిశు విక్రయం ఉదంతం సుఖాంతమైంది. విక్రయం జరిగినట్లుగా ప్రచారమైన ఆడశిశువును కుటుంబసభ్యులు గురువారం సీడబ్ల్యూసీ ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అక్టోబరు 5న జన్మించిన తన శిశువును విక్రయించలేదని, అనారోగ్యం కారణంగా జనగాంలోని సమీప బంధువుల ఇంటిలో బుధవారం ఉంచి భువనగిరి జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చానని, చికిత్స పూర్తయిన అనంతరం బంధువులకు ఫోన్‌చేయగా ఎత్తకపోవడంతో ఆందోళనకు గురయ్యామని వివరించారు. అయితే తన స్థితిని గమనించిన పెద్ద కుమార్తె జనగామలో ఉన్న శిశువు సమాచారాన్ని అదే రోజు టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా చైల్డ్ హెల్ప్‌లైన్‌కు తెలిపి సహాయాన్ని కోరిందని తెలిపింది. తన కుమార్తె తన వద్దే ఉంటోందని, తానే పెంచుకుంటానని తెలిపింది. దీంతో తల్లికి కౌన్సిలింగ్ చేసి శిశువును ఆమెకు అప్పగిస్తున్నట్లు సీడబ్ల్యూసీ ఛైర్మన్ బండారు జయశ్రీ తెలిపారు. రెండు రోజుల అనంతరం శిశువును మరోసారి హాజరుపర్చాలని ఆమెను ఆదేశించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు రోహిత, ఇస్తారి, శివరాజ్, మల్లేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్, దశరథ పాల్గొన్నారు.

పోలీసులపై చర్య తీసుకోవాలి



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఇంద్రియాల గ్రామస్థులు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అకారణంగా స్టేషన్‌కు తీసుకువచ్చి చితకబాదారని యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామ యువకులు గురువారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన నక్క బన్ని, నక్క సిద్ధు, మొగిలిపాక అక్షయ్, మొగిలిపాక చరణ్‌లను గురువారం ఉదయం తీసుకొచ్చి చితకబాదారని ఆరోపించారు. ఆందోళనలో మొగిలిపాక పరమేష్, మొగిలిపాక పోచయ్య, సురేష్, లింగస్వామి, కోట శేఖర్, భూదాన్‌పోచంపల్లికి చెందిన వడ్డేపల్లి యాదగిరి పాల్గొన్నారు. కాగా ఈ ఘటనపై ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తాము ఎవరినీ కొట్టలేదన్నారు. బుధవారం జరిగిన వివాదంలో బాధితుల ఫిర్యాదు మేరకు కొందరిని స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేశామన్నారు. గ్రామంలో అనేక పర్యాయాలు ఈ గ్యాంగ్‌పై ఫిర్యాదులు అందాయన్నారు. ఆ మేరకు అదుపులోకి తీసుకున్నామన్నారు.

క్రైం పాయింట్ Crime point

రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 2.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాచర్ల మండలం కమ్మంపాడు గ్రామానికి చెందిన కొండ శాంతమ్మ గ్రామాల్లో రేషన్‌బియ్యాన్ని సేకరించి పులగం బండతండాలో నిల్వఉంచి గురువారం ఓ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్ షేక్ నాగుల్ మీరా, వేముల నాగరాజులపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కోదాడటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడలో గురువారం జరిగింది. అయ్యప్పమాల ధరించిన తొగరు సైదయ్య కుటుంబంతో కలిసి పడిపూజకు సూర్యాపేట వెళ్లాడు. ఆ సమయంలో వంట గదిలో షార్ట్‌సర్క్యూటై మంటలు ఎగిసి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటికి తాళం ఉండటంతో చుట్టుపక్కల వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.30లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

అక్కా.. నేను చనిపోతున్నా

● సాగర్ ఎడమకాల్వలో దూకిన యువకుడు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆత్మహత్యాయత్నం చేసిన యువకుల్లో ఒకరు చనిపోగా, మరోచోట కాల్వలో దూకిన యువకుడు గల్లంతయ్యారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలానికి చెందిన యువకుడు తన అక్కకు ఫోన్‌లో మెసేజ్ పెట్టి సాగర్ కాల్వలో దూకాడు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో కడుపునొప్పి భరించలేక తండ్రి ఫోన్ చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా విడాకులు కావడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి చిట్యాల మండలంలో ఉరేసుకున్నాడు.



లావూరి మహేష్, బర్మ లింగస్వామి(ఫైల్)

వేములపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్కా నేను చనిపోతున్నానంటూ తమ్ముడు ఆమె సెల్‌కు మెసేజ్ పెట్టి సాగర్ ఎడమ కాల్వలో దూకాడు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఏఎస్‌ఐ నరసింహారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల మండలం బొల్లిగుట్ట తండాకు చెందిన లావూరి శివ(24) యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. సెలవులో ఇంటికి వచ్చిన శివ సివిల్స్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. తాను సాగర్ ఎడమకాల్వలో దూకి చనిపోతున్నానని ఓ ఆటోడ్రైవర్ నెంబరు నుంచి సోదరి శారదకు మెసేజ్ పెట్టాడు. ఆమె ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా, ఓ యువకుడిని వేములపల్లి బస్టాండ్‌లో దింపి నల్లగొండకు వెళ్తున్నట్లు ఆటోడ్రైవర్ చాపల మనోజ్ తెలిపాడు. తన తమ్ముడు చనిపోతున్నానంటూ మెసేజ్ పెట్టాడని, కాపాడమని కోరటంతో మనోజ్ సాగర్ ఎడమకాల్వ వద్దకు బయలుదేరాడు. కాల్వలో దూకిన శివ కొట్టుకుపోతుండటంతో మనోజ్ తన ఫోన్‌లో చిత్రీకరించి వారి కుటుంబసభ్యులకు తెలిపాడు. వెంటనే అక్కడికి చేరుకున్న శివ కుటుంబసభ్యులు కాల్వ వెంట చూడగా అప్పటికే గల్లంతైపోయాడు. శివ తండ్రి బాషా ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేశారు.

కడుపునొప్పి భరించలేక...

రామన్నపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సర్నేనిగూడెం గ్రామానికి చెందిన బర్మ లింగస్వామి(24) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం నొప్పి తీవ్రం కావడంతో వ్యవసాయ బావి వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. అనంతరం తండ్రి సత్యనారాయణకు ఫోన్ చేసి తాను క్రిమిసంహారక మందు తాగి చనిపోతున్నానని చెప్పాడు. హుటాహుటిన తల్లిదండ్రులు బావి వద్దకు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న లింగస్వామిని స్థానిక వైద్యుడి వద్దకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. లింగస్వామి తమ్ముడు బర్మ మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

ప్రేమ పెళ్లి విఫలమైందని...



మహేష్(ఫైల్)

చిట్యాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతికి పెద్దలు బలవంతంగా విడాకులు ఇప్పించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్‌ఐ ధర్మా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిట్యాల మునిసిపాలిటీ పరిధి వెంకటాపురం గ్రామానికి చెందిన చిరబోయిన మల్లయ్య కుమారుడు మహేష్(25) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఓ యువతిని రెండు నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకుని కొద్దిరోజులు హైదరాబాద్‌లో నివాసమున్నారు. వారిమధ్య మనస్పర్థలు రావడంతో ఈ నెల 11వ తేదీన మాట్లాడుకుని పెద్ద మనుషుల సమక్షంలో విడాకుల ఒప్పందం చేసుకున్నారు. అప్పటినుంచి మనస్తాపంతో ఉన్న మహేష్ గురువారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మహేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

ల్యాబ్ నిర్వాహకుడిపై హత్యాయత్నం

● నలుగురిపై కేసు నమోదు ● ఇద్దరు అరెస్ట్, బీజేపీ నాయకుడితో పాటు మరొకరు పరారీలో

భువనగిరి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ వివాదం నేపథ్యంలో యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలోని ఓ ల్యాబ్ నిర్వాహకుడిపై జరిగిన హత్యాయత్నంలో బీజేపీ నాయకుడు సహా ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి మండలం చందుపట్లకు చెందిన దంతూరి సురేష్ తన సోదరుడితో కలిసి భువనగిరి తాతానగర్‌లో ఎస్ఎల్ఎన్ఎస్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నాడు. అయితే ల్యాబ్ నిర్వాహకుడి కుటుంబంలో తలెత్తిన విభేదాలలో తలదూర్చిన భువనగిరి మునిసిపల్ బీజేపీ మహిళా కౌన్సిలర్ భర్త నల్లమాస వెంకటేశ్వర్లు తన అనుచరుడైన భువనగిరి పట్టణం ఆర్‌బీనగర్‌కు చెందిన ఏర్పుల శివతో ల్యాబ్ నిర్వాహకుడు సురేష్ హత్యకు పురమాయించాడు. దీంతో సురేష్ అదే బస్తీకి చెందిన సన్ని, అనాజీపురం ప్రాంతానికి చెందిన ఉపేందర్‌కు సురేష్ హత్య చేయాలంటూ ఇందుకు భారీ బహుమతి ఇస్తామని ఆశపెట్టాడు. దీంతో రూపొందించుకున్న ప్రణాళికలో భాగంగా ఈ నెల 2న రాత్రి ల్యాబ్ మూసివేసి బైక్‌పై ఇంటికి వెళ్తున్న సురేష్‌పై తాతానగర్ రహదారిపై అప్పటికే కాపుకాస్తున్న ఆ ఇద్దరు సురేష్‌ను ఆపి యాదగిరిగుట్టకు ఎలా వెళ్లాలని మాటల్లో పెట్టి బలమైన కర్రతో దాడికి దిగారు. అప్రమత్తమైన సురేష్ చేతిని అడ్డం పెట్టుకొని పరుగెత్తాడు. ఆ దాడిలో సురేష్ చెయ్యి విరిగింది. మరుసటి రోజు పట్టణ పోలీసులకు బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు చేపట్టిన దర్యాప్తులో ఉపేందర్‌ను 10న అదుపులోకి తీసుకొని విచారించగా హత్య కుట్ర బయటపడింది. 11న ఏర్పుల శివను అదుపులోకి తీసుకోగా ఏ-1 నిందితుడిగా ఉన్న నల్లమాస వెంకటేశ్వర్లు, సన్ని పరారీలో ఉన్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరిచి 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే సుమారు 10 రోజుల అనంతరం తేలిన హత్య కుట్ర స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సూర్యాపేటరూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా సూర్యాపేట మం డలం టేకుమట్ల గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. జాల లింగయ్య పాడి గేదె రోజు మాదిరిగానే గురువారం మేతకు వెళ్లింది. ట్రాన్స్‌పార్మర్ తీగలను తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ట్రాన్స్‌పార్మర్ దిమ్మె ఎత్తులో లేకపోవడంతో ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరారు.

దేశాభివృద్ధికి పరిశోధనలు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజీయు వీసీ

నల్లగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారత దేశ సమగ్రాభివృద్ధికి శాస్త్రీయతతో కూడిన పరిశోధనలు అవసరమని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం నల్లగొండ సమీపంలోని యూనివర్సిటీలో మెనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులు, పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై 10 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అత్యధిక జనాభా, వైవిధ్య భరితమైన దేశ స్థితిగతుల అనుసారం పరిశోధనలు సైతం అదేస్థాయిలో జరగాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న అనేక సవాళ్లకు సమర్థంగా పరిష్కార మార్గాలను చూపాల్సిన బాధ్యత ఉన్నత విద్యాలయాలపై ఉందన్నారు. దేశ నలుమూలల నుంచి అధ్యాపకులను, పరిశోధకులను భాగస్వాములను చేయడంతో పాటు నిష్ణాతులైన ఉపన్యాసకులను ఆహ్వానించడం విశ్వవిద్యాలయానికి శుభపరిణామన్నారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, రామ్‌లాల్, మిర్యాల రమేష్, వెంకటరమణారెడ్డి, అరుణ ప్రియ, లక్ష్మీప్రభ, శ్వేత, ప్రవళిక, సురేష్ రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి పాముకాటా.. గాయమా ?



పాఠశాల విద్యార్థి కింద పడినట్లు భావిస్తున్న మరుగు దొడ్ల సమీప ప్రాంతం

కేతేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం సాయంత్రం విద్యార్థి గాయపడటం చర్చనీయాంశమైంది. గత నెల 19న ఇదే పాఠశాలకు చెందిన సాయిగణేష్ అనే ఏడో తరగతి విద్యార్థి పాముకాటుకు గురైన సంఘటన మరువక ముందే మరోసారి అలాంటి సంఘటనే జరిగింది. పాఠశాలకు చెందిన పలువురు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన నీలం యాదగిరి కుమారుడు సాయిగణేష్ ఆరో తరగతి వరకు స్వగ్రామంలో చదివాడు. ఈ ఏడాది ఏడో తరగతికి కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు వద్ద గల బీసీ బాలుర గురుకుల పాఠశాలలో చేరాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 4.30గంటల ప్రాంతంలో మరుగుదొడ్డికి వెళ్లిన సాయిగణేష్ వచ్చేటప్పుడు కాలుకు స్వల్పగాయంతో ఏడుస్తూ వచ్చాడు. కాలు నుంచి స్వల్పంగా రక్తం వస్తుండడం చూసి తోటి విద్యార్థులు పాము కరిచిందంటూ గోల చేశారు. దీంతో ఏం జరిగిందో తెలియక ఆందోళన చెందిన పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మ, ఏఎన్ఎం ప్రబంధ, పీఈటీలు హుటాహుటిన సాయిగణేష్‌ను నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ అందుబాటులో ఉన్న చిన్నపిల్లల వైద్యుడికి చూపించి మెరుగైన చికిత్స కోసం నల్లగొండ జిల్లా కేంద్ర ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఈ సమాచారం అందుకున్న సాయిగణేష్ తల్లిదండ్రులు హుటాహుటిన నల్లగొండ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాయి గణేష్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటన విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ పాల్వాయి ధనమ్మను సంప్రదించేందుకు యత్నించగా ఆమె సెల్‌ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. దీంతో సంఘటన పూర్తి వివరాలు తెలియరాలేదు. ఇదే విషయమై కేతేపల్లి ఎంఈవో ఆకవరం రాజేంద్రప్రసాద్‌ను సంప్రదించగా విద్యార్థి సాయి గణేష్ పాముకాటుకు గురికాలేదని ప్రిన్సిపాల్ తనకు తెలిపిందన్నారు. వాష్‌రూంకు వెళ్లి వస్తున్న క్రమంలో జారి కిందపడిన విద్యార్థి సాయిగణేష్ కాలుకు కట్టెపుల్ల గీరుకుని రక్తంరావడంతో ఆందోళన చెందిన తోటి విద్యార్థులు పాము కరిచిందంటూ అరిచారని ప్రిన్సిపాల్ తనకు సమాచారం ఇచ్చిందన్నారు. ఆ తర్వాత ప్రిన్సిపాల్ తనకు సైతం ఫోన్‌లో అందుబాటులో లేదన్నారు.

వివాహిత అదృశ్యం



జెర్రిపోతుల ఝాన్సీ

నిడమనూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఉట్కూరు గ్రామానికి చెందిన జెర్రిపోతుల ఝాన్సీ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపారు. ఈనెల 7వ తేదీన ఐకేపీ సెంటర్‌లో విధులు నిర్వహించడానికి వెళ్తున్న అని చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడం, ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తుండడంతో భర్త జెర్రిపోతుల నర్సింహ గురువారం నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఇటీవల పత్తి ఏరే విషయంలో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగినట్లు సమాచారం. భర్త ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గోపాల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసారంలో యువతి

చౌటుప్పల్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు. జైకేసారం గ్రామానికి చెందిన యువతి(18) హైదరాబాద్‌లో నర్సింగ్ కోర్సు చదువుతోంది. ఈనెల 8న కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరింది. ఆ రోజు నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆమెకోసం బంధువుల ఇళ్లలో వెతికారు. కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ధర్మాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎగిసిన మంటలను చల్లార్చిన రైతులు

మోత్కూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎగిసిన మంటల నుంచి ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రైతు నర్సింహారెడ్డి వ్యవసాయ భూమిలో పెంచిన జామాయిల్ చెట్లను విక్రయించగా వాటిని కూలీలు నరికివేశారు. ఆ తర్వాత చెత్తను తగుల బెడుతుండగా పక్క రైతుల భూముల్లోకి మంటలు వ్యాపించి లింగయ్యకు చెందిన విద్యుత్ మోటారు కేబుల్ వైరు కాలిపోయింది. మంటలు విస్తరించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మంటలు ఎగిసిపడ్డాయి. మంటలకు ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి ప్రమాదం జరుగుతుందని గ్రహించిన లింగయ్య భార్య మరికొందరు రైతులు వెంటనే స్పందించి మంటలు ఆర్పేశారు. దీంతో పెద్దప్రమాదం తప్పింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు లింగయ్య తెలిపాడు.

గోశాలకు న్యాయం జరిగేవరకు ఉద్యమిస్తాం

హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



ఆలేరులో విలేకరులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

ఆలేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోశాలపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేసేంతవరకు హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఉద్యమిస్తుందని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గట్టిగొమ్ముల రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11న యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం బహదూర్‌పేటలో దాడిలో ధ్వంసమైన గోశాలను ఆయన గురువారం పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. గోశాలపై దాడి చేసి ఆస్తులు ధ్వంసం చేసిన దుండుగులపై గోశాల నిర్వాహకుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు అరెస్టు చేయకుండా ఫిర్యాదుదారులపై కేసు నమోదు చేయడం హాస్యాస్పదమన్నారు. ధ్వంసం చేసిన గోశాలకు న్యాయం జరిగేవరకు ఉద్యమిస్తామన్నారు. ఆ గ్రామానికి చెందిన కూళ్ల నర్సింహులు దాడి జరిపించడం సహించరాదన్నారు. ఈ చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు పక్షపాతధోరణి అవలంబిచడం సరికాదన్నారు. నిందితులను అరెస్టుచేసి గోశాలను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బజరంగ్ దళ్ మండల కమిటీ బాధ్యులు ప్యారాపు శివకృష్ణ, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా ప్రధానకార్యదర్శి కుండే గణేష్, గోశాల నిర్వాహకుడు జంపాల దశరథ, దయ్యాల సంపత్, మైదం భాస్కర్, శ్రీనివాస్, రమేష్, పాశికంటి సంపత్, ఆనంద్ ఉన్నారు.

ఇక్కడ శిక్షణతో యువత సెట్‌విన్

● స్వల్పకాలిక కోర్సులతో దీర్ఘకాలిక ఉపాధి కలిగేలా కోర్సుల రూపకల్పన ● ఈ-వెహికల్స్ సర్వీస్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి ఆధునిక కోర్సులపైనా శిక్షణ ● ఈ శిక్షణతో యువత, మహిళలకు తక్షణ స్వయం ఉపాధికి ఛాన్స్

(5వ పేజీ తరువాయి)

ఈ సెట్విన్‌శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. జనవరి 1నుంచి 26 రకాల కోర్సుల్లో శిక్షణ అందించేందుకు సిద్ధమైన సెట్విన్ కేంద్రంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం యువత కోసం..

ఉపాధికి ఉత్తమ మార్గం

రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నడిచే సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ ట్విన్ సిటీస్) యువత తక్షణం స్వయం ఉపాధి పొందే కోర్సులను ఎప్పటికప్పుడు సమాజ అవసరాలకనుగుణమైన కోర్సుల్లో స్వల్పకాలిక శిక్షణ అందజేస్తోంది. నామమాత్రపు ఫీజులతో ఇక్కడ యువతకు శిక్షణ అందిస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన యువత శిక్షణ పూర్తయిన వెంటనే నామమాత్రపు పెట్టుబడులతో స్వయం ఉపాధి పొందవచ్చు. ఈ కేంద్రాల్లో కోర్సుల్లో నైపుణ్యం సాధించిన అభ్యర్థులను పలు ఎంఎన్‌సీ (మల్టీనేషనల్ కంపెనీలు), మ్యాన్‌పవర్ ఏజెన్సీలు సైతం ప్లేస్‌మెంట్ల ద్వారా ఉద్యోగాలిస్తున్నారు. ఇక్కడ శిక్షణ ఇచ్చే కోర్సుల సిలబస్‌ను సిద్ధాంతపరంగానే కాకుండా ప్రాక్టికల్‌గా కోర్సు పూర్తయ్యేలోగా యువత ఆ పనిలో నైపుణ్యం సాధించేలా నిపుణుల బృందంతో సెట్విన్ రూపొందింపజేసింది. దీంతో ఇక్కడ శిక్షణ పొందినవారికి నైపుణ్యాలుంటుండడంతో పలు విదేశీ సంస్థల్లోనూ అవకాశాలు దక్కించుకుంటున్నారు. ప్లంబర్ వంటి కోర్సుల్లో శిక్షణ పొందిన అభ్యర్థులు సైతం సౌదీ అరేబియా వంటిదేశాల్లో ఉపాధి పొందుతుంటే, కంప్యూటర్ కోర్సులు, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణ పొందిన వారు పలు ప్రఖ్యాత సంస్థల్లో ఉద్యోగాలు దక్కించుకుంటున్నారు.

అయిదు విభాగాలు.. 26 రకాల కోర్సులు

సెట్విన్ కేంద్రంలో కంప్యూటర్ కోర్సులు, ఎడ్యుకేషనల్ కోర్సులు, టెక్నికల్ కోర్సులతోపాటు ప్రత్యేకంగా మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు, బ్యూటీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ కోర్సుల్లో అయిదు రకాలు, ఫ్యాషన్ డిజైనింగ్‌లో అయిదు రకాలు, బ్యూటీషియన్ కోర్సుల్లో అయిదురకాలు, ఎడ్యుకేషన్ కోర్సులు రెండు రకాలు, టెక్నికల్ కోర్సులు తొమ్మిది రకాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రైవేట్‌లో రూ.లక్షలు.. ఇక్కడ నామమాత్రపు ఫీజు

సెట్విన్ ద్వారా శిక్షణ అందించే కోర్సులను సైతం ఎప్పటికప్పుడు సమాజ ఆధునిక అవసరాలకనుగుణంగా, అడ్వాన్స్‌డ్ కోర్సులను ప్రవేశపెడుతోంది. దీంతో వీటికి ఆదరణ అదేస్థాయిలో ఉంటోంది. ప్రధానంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో రూ.లక్షల ఫీజులతో అందించే ఫ్యాషన్‌డిజైనింగ్


మహిళలకు శిక్షణ కోసం సిద్ధం చేసిన కుట్టు మిషన్లు


శిక్షణకోసం సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ వాహనం

కోర్సులను ఇక్కడ కేవలం రూ.3వేల నామమాత్రపు ఫీజుతో అందిస్తుండడం గమనార్హం. అంతేకాకుండా ప్రస్తుతం ట్రెండింగ్‌గా కొనసాగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల రిపేరింగ్ సర్వీస్ కోర్సుని సైతం అందుబాటులోకి తేవడం అడ్వాన్స్ కోర్సులను ప్రవేశపెడుతుందనేందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఏడో తరగతి కనీస విద్యార్హత ఉన్నవారికి ఆరునెలల ఈ కోర్సులో ప్రవేశానికి అర్హతగా నిర్ణయించారు. అరుదైన ఈ కోర్సుని సైతం కేవలం రూ.2వేల నామమాత్రపు ఫీజుతోనే అందిస్తున్నారు. అదేవిధంగా కంప్యూటర్ అకౌంటెన్సీ, వెబ్ డిజైనింగ్, ఎంఎస్ ఆఫీస్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్, సీ, సీప్లస్ ప్లస్‌వంటి కంప్యూటర్ కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా పదోతరగతి విద్యార్హతతో ప్రీప్రైమరీ టీచర్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ కోర్సుని, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులని అందిస్తున్నారు.

మహిళల కోసం ప్రత్యేకంగా కోర్సుల రూపకల్పన

మహిళల కోసం ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులను ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు. ఏడోతరగతి కనీస విద్యార్హతతో ఫ్యాషన్‌డిజైనింగ్ కోర్సుని అందుబాటులోకి తెచ్చారు. నాలుగు సెమిస్టర్లుగా ఈ కోర్సుని సెట్విన్ అందిస్తోంది. మొదటి సెమిస్టర్‌లో గార్మెంట్ మేకింగ్, రెండో సెమిస్టర్‌లో ఫ్యాషన్ డిజైనింగ్, మూడో సెమిస్టర్‌లో అడ్వాన్స్ ఫ్యాషన్ డిజైనింగ్, నాలుగో సెమిస్టర్‌లో టెక్స్‌టైల్ డిజైనింగ్ కోర్సులను అందజేస్తున్నారు. అదేవిధంగా జర్దోసీ శిక్షణను కూడా అందజేస్తున్నారు. వీటితోపాటు బ్యూటీషియన్ కోర్సుని సైతం నాలుగు సెమిస్టర్లుగా విభజించి ఆయా కోర్సులలో తర్ఫీదునిస్తారు. మెహందీ డిజైన్‌కు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.

తొమ్మిది విభాగాల్లో సాంకేతిక కోర్సులు

అత్యాధునికమైన ఈ-వెహికిల్ రిపేరింగ్ సర్వీస్, ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, మొబైల్ సర్వీసింగ్, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీసింగ్, ప్లంబింగ్, ఆటో ఎలక్ట్రీషియన్, డీజిల్‌మెకానిక్, డిప్లొమా ఇన్ ఆటో మొబైల్ కోర్సులను కూడా సెట్విన్ స్వల్పకాలిక శిక్షణలో అందిస్తోంది.

జనవరి 1నుంచి కోర్సులు ప్రారంభం

నల్లగొండలో ఏర్పాటు చేసిన సెట్విన్ కేంద్రంలో జనవరి 1నుంచి 26 కోర్సుల్లో శిక్షణ ప్రారంభమవుతుంది. ఇందుకోసం ఈ నెల 20వరకు అభ్యర్థులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆ తర్వాత మూడురోజులు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రతీ కోర్సుకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తారు. ఒక్కో బ్యాచ్‌లో 20 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతిరోజూ ఉదయం సెషన్‌లో ఒకబ్యాచ్‌కు, మధ్యాహ్నం సెషన్‌లో రెండోబ్యాచ్‌కు శిక్షణ ఇస్తారు. ఒక్కో సెషన్‌లో అన్ని కోర్సులు కలిపి 520 మంది.. రెండు బ్యాచ్‌లకు కలిపి 1,040 మందికి శిక్షణ అందిస్తారు.



యువత సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండలో ఏర్పాటు చేసిన సెట్విన్ శిక్షణా కేంద్రాన్ని స్థానిక నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. గృహిణులు, బాలికలు సైతం వారికోసం ఉద్దేశించిన ప్రత్యేక కోర్సుల్లో ఇక్కడ శిక్షణ పొందితే ఆ తదుపరి తక్షణం స్వయం ఉపాధి పొందవచ్చు. చాలా అడ్వాన్స్ కోర్సులు సెట్విన్ రూపకల్పన చేసి అందుబాటులోకి తెచ్చింది.

ఎం. సరిత, సెట్విన్ కేంద్రం ఇన్‌చార్జి

స్తంభించిన విద్యాశాఖ


సమ్మెలో భాగంగా నల్లగొండలో విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

(5వ పేజీ తరువాయి)

ఇన్‌స్ట్రక్టర్లు, కుక్‌లు, వాచ్‌మన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు సేవలందిస్తున్నారు.

కేజీబీవీల్లో నిలిచిపోనున్న బోధన

కేజీబీవీల్లో స్పెషలాఫీసర్లు మొదలు స్వీపర్ల వరకు సమ్మెకు దిగడంతో విద్యాలయాల్లో బోధన పూర్తిగా కుంటుపడింది. అన్ని విభాగాలవారు సమ్మెలోకి వెళ్లడంతో స్కూళ్ల నిర్వహణ సవాలుగా మారింది. సమ్మె ఇలాగే కొనసాగితే బాలికలు విద్యాలయాలను వదిలి ఇళ్లకు వెళ్లే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని విద్యా నిపుణులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు సూచిస్తున్నారు.

డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె



న్యాయబద్ధమైన మా డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్నాం. దశలవారీగా మేం చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం. ఇప్పటికైనా స్పందించి మాకు న్యాయం చేయాలి. మా డిమాండ్లు పరిష్కరించాలి. అప్పటివరకకు సమ్మెను కొనసాగిస్తాం.

రేణుక, సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం, నల్లగొండ జిల్లా సలహాదారు

ఉద్యోగభద్రత కల్పించాలి



సమగ్రశిక్ష పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగభద్రత కల్పించాలి. అందరినీ క్రమబద్ధీకరించాలి. ప్రతి ఒక్కరికీ రూ.20లక్షల బీమా, రూ.10లక్షల ఆరోగ్య బీమా కల్పించాలి. అదేవిధంగా నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నాం.

ఏ.నాగరాజు, సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వానిది మాటల గారడీ

● మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్


మోత్కూరులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మోత్కూరు, తుంగతుర్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం మాటల గారడీతో కాలం వెళ్లబుచ్చు తోం దని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విమర్శించారు. యాదాద్రి భువన గిరి జిల్లా మోత్కూరు, తుంగతుర్తిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఏడాదిలో 66 హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. రైతు భరోసా, కౌలు రైతు భరోసా, మహాలక్ష్మీలో మహిళలకు రూ.2500, ఆసరా పింఛన్ల పెంపు, ఇం దిరమ్మ ఇళ్లు, యువ వికాసంలాంటి హామీలన్నీ ఏమయ్యా యని ప్రశ్నించారు. బీజేపీతోనే తెలంగాణలో మార్పు సాధ్యమ వుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు మహిళా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆయా సమావేశాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు భాగ్యరెడ్డి, మోత్కూరు పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య, నాయకులు కొతణం నాగార్జునరెడ్డి, గౌరు శ్రీనివాస్, మల్లెపాక సాయిబాబా, యశ్వంత్, గాజుల మహేందర్, మాజీ సర్పంచ్ సంకినేని స్వరూప రవీందర్‌రావు, సంజీవరెడ్డి, గోపగాని రమేష్ గౌడ్, పులుసు వెంకటనారాయణగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లింగం యాదవ్

శాలిగౌరారం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని ఆదర్శ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరబోయిన లింగం యాదవ్ కోరారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని గురువారం జరిగిన నకిరేకల్ డివిజన్ సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఏర్పాటు చేసిన ఆదర్శ రైతు వ్యవస్థను 2014 కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిందని, 16వేల కుటుంబాలు బజారున పడ్డాయన్నారు. ఆదర్శ రైతు వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ధరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తిరిగి ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరిస్తానని ఎన్నికల మెనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తుచేవారు. ఇటీవల వ్యవసాయం శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును తాము కలిసినపుడు తిరిగి ఆదర్శ రైతులను తీసుకుంటామని చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆదర్శ రైతులను ఇంకా విధుల్లోకి తీసుకోక పోవడం అన్యాయమన్నారు. తమను విధుల్లోకి తీసుకుంటే రైతు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తాము ముందుటామన్నారు. రైతు భరోసా, రైతు బీమా, డిజిటల్ క్రాప్ సర్వే తదితర విషయాల్లో మండల స్థాయిలో ఏవోలకు, ఏఈవోలకు ఆదర్శ రైతు వ్యవస్థ సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెదరమెట్ల కోటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి బట్ట శివ భిక్షం, నకిరేకల్ డివిజన్ అధ్యక్షులు దొంతూరి శంకర్, ఒంటిపాక భీమయ్య, గందమళ్ల అంతయ్య, దుర్గం అంజయ్య, బండారు యాదగిరి, అల్లి సైదులు, వేముల వెంకన్న, వీరయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో నల్లగొండ జిల్లాకు మొదటి స్థానం

కొండమల్లేపల్లి, గుర్రంపోడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌లో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సన్నధాన్యం కొనుగోలు కేంద్రం, గుర్రంపోడు మండలంలోని చామలేడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేసి మిల్లులకు ఎగుమతి చేయాలని ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని తూర్పార బట్టి తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. అనంతరం కొండమల్లేపల్లి మండల పరిధిలోని పలు పార్‌బాయిల్డ్ మిల్లుల్లో ధాన్యాన్ని ఆయన తనిఖీచేశారు. గుర్రంపోడు మండలంలోని పాల్వాయి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి సర్వేను తనిఖీచేశారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ హరీష్, డీటీసీఎస్‌లు హనుమంతు వెంకటేశ్‌గౌడ్, రావుల సైదులుగౌడ్ ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

● నేడు యాదగిరిగుట్టకు బండారు దత్తాత్రేయ రాక

భువనగిరి అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్ర వైడూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు గజ వాహన సేవలో తీర్చిదిద్దారు. అనంతరం వేదమంత్ర పఠనం, మంగళ వాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడికి తొలి పూజలతో కల్యాణతంతు నిర్వహించారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమ పూజలు చేశారు. సుప్రభాతవేళ గర్భాలయంలో స్వామి, అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాత గుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.28,40,268 ఆదాయం సమకూరిందని దేవస్థాన ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

సాయంత్రంవేళ సేవోత్సవం

యాదగిరీశుడి ఆలయంలో కొనసాగుతున్న తిరుమంగై ఆళ్వార్, తిరుప్పాని ఆళ్వార్ తిరునక్షత్రోత్సవంలో భాగంగా పౌరప్పాట్టు సేవోత్సవం నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో ప్రబంధ పఠనాల నడుమ


ప్రబంధ పారాయణాలు చేస్తున్న వేద పండితులు, లక్ష్మీనరసింహాచార్యులు

చేపట్టిన సేవోత్సవాన్ని ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలు ఈ నెల 14 వరకు కొనసాగనున్నాయి.

నేడు హరియాణా రాష్ట్ర గవర్నర్ రాక

హరియాణా రాష్ట్ర గవర్నర్ బంగారు దత్తాత్రేయ శుక్రవారం యాదగిరిగుట్టకు రానున్నారు. ఉదయం 11.30 గంటలకు యాదగిరికొండపైకి చేరుకొని స్వామివారి చెంతన పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం యాదగిరిగుట్ట మండలంలోని కాచారం ధర్మారెడ్డిగూడెం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించనున్నారు. అనంతరం 3.30గంటలకు భువనగిరిలోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి క్షేత్రానికి వెళ్లి పూజలు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

మోదుగు నరేందర్‌రెడ్డికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న మోదుగు నరేందర్‌రెడ్డి

మాడ్గులపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చిరుమర్తి పరిధిలోని జాలుబావిగూడేనికి చెందిన మోదుగు నరేందర్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. కెమిస్ట్రీలో 'డిజైన్, సింథసిస్ అండ్ బయాలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ సమ్ నావల్ హెటిరో సైక్లిక్ కాంపౌండ్స్ మాజ్ మాస్టీ కాన్సర్ అండ్ మాస్టీ మైక్రోబియల్ ఏజెంట్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. డాక్టర్ కవిత పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, వైస్ ఛాన్స్‌లర్ దామోదర్, వీరవెంకటయ్య, రూబెన్, రవీందర్‌రెడ్డి, జగదీశ్వర్, సుందర్‌రాము, రాజు, రాంబాబు డాక్టరేట్ పొందిన మోదుగు నరేందర్‌రెడ్డిని అభినందించారు.


నల్లగొండ సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న టీజేఎస్ అధ్యక్షుడు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నల్లగొండ టౌన్, భువనగిరి (కలెక్టరేట్),డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొలుగూరి కృష్ణ, మంగ పాండరి, కార్య దర్శులు బొమ్మగాని రాజు, మద్దెల తిరుపతి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు నల్లగొండ, భువనగిరి కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలోని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులుగా నల్లగొండ జిల్లాలో సుమారు 1100 మంది, భువనగిరి జిల్లాలో 500మందికిపైగా వివిధ విభాగాల్లో పని చేస్తున్నారన్నారు. 20 ఏళ్లుగా విద్యాశాఖ అభివృద్ధికి కృషి చేస్తున్నా తమకు సరైన వేతనాలు అందక ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి సమ్మెలో సుమారు 350 మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ చంద్రశేఖర్, గుమ్మల మంజులారెడ్డి, సావిత్రి, వి.సావిత్రి, పుష్పలత, సాయిల్, వెంకట్, వెంకటేశ్వర్లు, చందపాక నాగరాజు, లలిత, కొండయ్య, యాదయ్య, యాట వెంకట్, ధార వెంకన్న, శ్రీనివాస్, ఎర్రమల నాగయ్య, రమేష్, వసంత, సుజాత, నిరంజన్, వెంకటకృష్ణ, నాగయ్య పాల్గొన్నారు. నల్లగొండలో శిబిరాన్ని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు పన్నాలగోపాల్‌రెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు.

సమ్మెకు పీఆర్టీయూ, డీటీఎఫ్ సంఘీభావం..

భువనగిరిలో నిరవధిక సమ్మెకు డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుంకోజు భాస్కర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గడసంతుల మధుసూదన్ పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. అనం తరం ఉద్యోగుల సమ్మె ఖర్చుల కోసం రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో నరేందర్, కరుణాకర్, శిరీష, భవాని, కవిత, జహంగీర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, నరేష్ స్వామి, బాబు పాల్గొన్నారు.

గానం.. ఆయన ప్రాణం


కలశన్ అశోక్ స్వామి

» వందకు పైగా అయ్యప్పస్వామి భక్తి పాటలు » 31 ఏళ్లుగా మాలధారణలో గురుస్వామి కలశన్ అశోక్
» తెలుగుతో పాటు తమిళ భాషలో గానం » అనేక మంది మాలధారణకు ప్రోత్సాహం

స్వామియే శరణం అయ్యప్ప.. ఈ గానమే ఆయన ప్రాణం. 31 ఏళ్లుగా అయ్యప్పస్వామి సేవలో తరిస్తున్నారు నల్లగొండ జిల్లాకేంద్రంలోని రామగిరికి చెందిన గురుస్వామి కలశన్ అశోక్. అయ్యప్ప స్వామి భ క్తుడైన ఆయన ప్రజల్లో భక్తి భావం పెంపొందిస్తున్నారు. భక్తి గీతాలు ఆలపిస్తూ అనేక మందిని ఆయన మా లధారణకు ప్రోత్సహించారు. అశోక్ పట్టణంలో చిన్న వ్యా పారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళ భాషలో కూడా పాటలు పాడతారు. ప్రస్తు తం ఆయన గురుస్వామిగా భక్తులకు సేవలందిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ కల్చరల్)

కార్తీక మాసంలో అయ్యప్పస్వామి భక్తులు మాల ధారణ చేస్తారు. 41 రోజుల పాటు కఠోర దీక్ష చేస్తూ ప్రతి రోజూ అయ్యప్ప దేవాలయంలో ఉదయం, సాయంత్రం పూజతో పాటు భజన భక్తి గీతాలతో తన్మయం పొందుతారు. రామగిరిలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 31 సంవత్సరాల క్రితం అశోక్ మాలధారణ ప్రారంభించారు. దివంగత రాజన్ గురుస్వామి కుమారుడైన అశోక్ తండ్రి స్ఫూర్తితో ఆసక్తి పెంచుకున్నారు.

పాట పాడితే తన్మయత్వమే..

అయ్యప్పస్వామి భక్తులను ప్రోత్సహిస్తూనే వారిలో భక్తిభావం పెంపొందించే విధంగా భజన కార్యక్రమాలు ప్రారంభించారు. 25 సంవత్సరాలనుంచి వందల సంఖ్యలో భక్తిగీతాలు ఆలపిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. శబరి అంటే అయ్యప్ప స్వామి అనే విధంగా తన పాటలతో భక్తిభావాన్ని నింపుతున్నారు. మాలధారణ ధరించిన భక్తుల ఇళ్లలో నిర్వహించే మండలపూజ, పడిమెట్లు, ఇతర పూజా సమయంలో పూజా కార్యక్రమం అనంతరం అశోక్ ఆలపించే భక్తి గీతాలతో భక్తులను మైమరిపిస్తారు. వీఆర్ టాకీస్ సౌజన్యంతో యూ ట్యూబ్‌లో సైతం తన పాటలను తెలుగుతో పాటు తమిళ భాషలో కూడా ఆలపిస్తున్నారు.

అయ్యప్ప దేవాయ నమః

అయ్యప్ప దేవాయ నమహా.. అభయ స్వారూపాయ నమహా.. స్వామి అయ్యప్ప.. స్వామి అయ్యప్ప నీవే గతి దేవా నన్నుబ్రోవగా రావా.. శరణ శరణం.. మీ శరణమయ్యప్ప.. గళ్లు గళ్లు గజ్జలు కట్టి మా అయ్యప్ప స్వామి.. దైవమే శరణం అయ్యప్ప.. ఏకాంతవాస శరణ అయ్యప్ప... పవళింపు పాట.. ఊగు ఉయ్యాల నా స్వామి ఉయ్యాల.. వస్తున్నా.. వస్తున్నా శరణమయ్యప్ప.. నీ కొండకు వస్తున్న అయ్యప్ప.. అయ్యప్ప నీకు పాలాభిషేకం అయ్యప్ప అంటూ పాడే పాటలు భక్తులను తన్మయత్వం చెందిస్తున్నాయి.


పాటలు పాడుతున్న అశోక్ స్వామి

అయ్యప్ప శరణం..

నాన్నే నాకు స్ఫూర్తి



మా నాన్న కీర్తిశేషులు రాజన్ గురుస్వామి నాకు స్ఫూర్తి. చిన్నప్పటి నుంచి అయ్యప్పస్వామి భక్తుడు. ఆయన మా ఇంట్లో పాడిన భక్తి గీతాలు ప్రేరణ ఇచ్చాయి. అప్పటి నుంచే నేను కూడా అయ్యప్ప స్వామి భక్తుడినయ్యా రామగిరిలోని హరిహర పుత్ర స్వామి దేవాలయంలో మా నాన్న గురుస్వామిగా ఉండేవారు. అప్పట్లో కుటుంబసభ్యులంతా అయ్యప్పస్వామి సన్నిధిలోనే ఎక్కువ సమయం గడిపేవారం. నేను కూడా 31సంవత్సరాల నుంచి అయ్యప్ప స్వామి సేవలోనే పూజలు, పాటలతో గుడుపుతున్నాను. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొలనుపాక రవికుమార్ గురుస్వామి, నోముల శ్యాం గురుస్వాముల ప్రోత్సాహంతో ముందుకు సాగుతున్నా. నా భార్య, పిల్లల సహకారంతోనే స్వామివారికి సేవ చేసే భాగ్యం లభించింది.

- గురుస్వామి కలశన్ అశోక్

సేవలకు గుర్తింపు..

అశోక్ అయ్యప్పస్వామి భక్తుడిగానే కాకుండా సేవా కార్యక్రమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. 2018లో కేరళకు చెందిన అఖిల భారత అయ్యప్ప ప్రచార సమితి ఆధ్వర్యంలో 'అయ్యప్పపూర్' అవార్డు అందుకున్నారు. రెండు రాష్ట్రాల్లో ఇద్దరు గురుస్వాముల కే ఈ అవార్డు వరించింది. అశోక్‌స్వామికి ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా అనేక అవార్డులు అందజేశాయి.

మంత్రి కోమటిరెడ్డి సారథ్యంలో పట్టణాభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

పూర్తిచేయించాం. ఇప్పుడు పూర్తిగా వినియోగంలోకి తెచ్చాం.

● పట్టణంలో యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు బాయ్స్ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను రూ.25కోట్లతో మంత్రి మంజూరు చేయించారు. ఇక్కడ ఆరు రకాల ఆధునిక కోర్సులు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం భవనం, ల్యాబ్‌ల నిర్మాణాలు చివరిదశకు వచ్చాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇక్కడ తరగతులు ప్రారంభమవుతాయి. అదేవిధంగా సెట్విన్ ఆధ్వర్యంలో మరో వృత్తినైపుణ్య కేంద్రం పట్టణంలో ఏర్పాటు చేయించారు. ఇక్కడ 26 రకాల స్వయం ఉపాధి పథకాలపై శిక్షణ ఇస్తారు. ఫ్యాషన్ టెక్నాలజీ, కంప్యూటర్‌కోడింగ్ వంటి ఆధునిక కోర్సులు సైతం ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రతీ మూడు నెలలకు 1,000 మందికిపైగా నిరుద్యోగులకు ఈ కేంద్రం ద్వారా శిక్షణ అందుతుంది.

● నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని గతంలో వెంకటరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 150 పడకల నుంచి 450 పడకలకు మార్పించారు. ఆసుపత్రిలో మెరుగైన సదుపాయాల కోసం రూ.25కోట్లతో అదనపు జనరల్ వార్డు భవనం, రూ.12కోట్లతో క్రిటికల్ కేర్‌వార్డు కోసం భవనాలు నిర్మిస్తున్నారు. ప్రతీక్‌ఫౌండేషన్ ద్వారా 26 ఏసీలు అందజేశాం. రూ.5లక్షలతో కూల్‌హోమ్ ఏర్పాటు చేయించాం.

● తాగునీటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు మంత్రి సొంత నిధులతో ఆరు మోటార్లు అదనంగా ఏర్పాటు చేయించాం. రూ.56 కోట్లతో 10 వాటర్‌ట్యాంకుల నిర్మాణాలు చేపట్టాం. మరో వాటర్‌ట్యాంక్ కూడా నిర్మిస్తాం. దానికి అనుమతి రావాల్సి ఉంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో నిరంతర తాగునీటిసరఫరా కోసం 70ఎంఎల్‌డీ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించాం. రూ.96కోట్లతో డీపీఆర్ రూపొందించి యూఐటీఎఫ్ నిధుల కోసం నివేదిక సమర్పించాం. మంత్రి సహకారంతో ఈ డీపీఆర్ ఆమోదం పొందుతుందని ఆశిస్తున్నాం.

● పట్టణంలో రూ.216 కోట్ల అమృత్ 2.0 నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు 13వార్డుల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే 40శాతంపైగా పనులు పూర్తయ్యాయి. జనవరి నెలాఖరులోగా పనులు పూర్తిచేసేలా కార్యాచరణ అమలు చేయిస్తాం.

● నల్లగొండలోని అన్ని కాలనీల్లో అంతర్గత సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతున్నాం. ఇప్పటికే ఉన్నవాటికి అవసరమైన చోట మరమ్మతులు చేపడుతున్నాం. ఎఫ్ఐడీసీ కింద రూ.54 కోట్లతో 55కిలోమీటర్ల సీసీరోడ్లు చేపట్టగా, అందులో ఇప్పటికే 18కిలోమీటర్లు పూర్తిచేయగా, మిగిలిన పనులు కొనసాగిస్తున్నాం. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.109కోట్లతో 90కిలోమీటర్ల సీసీరోడ్లు, 18కిలోమీటర్ల అంతర్గత బీటీ రోడ్ల పనులు చేపట్టాం. ఎఫ్‌డీఐసీ నిధులతో 35కిలోమీటర్ల డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టగా, 8కిలోమీటర్ల మేర నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎస్‌డీఎఫ్ నిధులు మరో రూ.18 కోట్లతో డ్రైనేజీ పనులు చేపట్టాం. మునిసిపాలిటీలో విలీన వార్డుల్లో కూడా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. కొన్ని పూర్తవగా, మరికొన్ని వేగంగా సాగుతున్నాయి.


మ్యాప్ పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

● బీట్‌మార్కెట్ వద్ద రూ.1.50కోట్లతో ఆధునిక వసతులతో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలో నాణ్యమైన ఆహారం అందేలా దీన్ని అందుబాటులోకి తెస్తాం.

● మంత్రి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే నిధుల నుంచి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో రూ.కోటితో అదనపు తరగతి గదులు నిర్మించాం. బొట్టుగూడ పాఠశాలను రూ.3కోట్లతో నిర్మిస్తున్నాం. రూ.12కోట్లతో పాత టౌన్‌హాల్ స్థలంలో గ్రంథాలయ నిర్మాణం చేపడుతున్నాం. ప్రతీక్‌ఫౌండేషన్ ద్వారా రూ.20లక్షలతో ఉమెన్స్ డిగ్రీ కళాశాల, ఎన్జీ కళాశాలల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశాం. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 14 ఏసీలు, రూ.10లక్షలతో పుస్తకాలు అందజేశాం. ఎంజీ యూనివర్శిటీలో రూ.10లక్షలతో పుస్తకాలు అందజేశాం.

● పట్టణానికి మణిహారంలా ఉండేలా రూ.538కోట్లతో బైపాస్‌రోడ్డును మంత్రి మంజూరు చేయించారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల సీఎం పర్యటన సందర్భంగా లతీఫ్‌సాహెబ్ గుట్టపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి రూ.110కోట్లు, బ్రహ్మంగారి గుట్టపైకి రోడ్డు నిర్మాణానికి రూ.30కోట్లు మంజూరు చేయించారు. పనులు త్వరలో ప్రారంభమవుతాయి. డీఈవో ఆఫీసు నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న రోడ్డు, సుభాష్‌చంద్రబోస్ విగ్రహం నుంచి ఔట్‌డోర్ స్టేడియం వరకు రహదారుల పనులు త్వరలో పూర్తిచేయించాలని మంత్రి ఆదేశించారు.

● శివారు గ్రామాలను మునిసిపాలిటీలో విలీనం చేశాక నూతన మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సి ఉంది. పదేళ్లుగా మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో పట్టింపులేకుండా వ్యవహరించారు. మంత్రి సూచనలతో త్వరలో సమగ్రమైన మాస్టర్ ప్లాన్ రూపొందిస్తాం. పట్టణాన్ని భవిష్యత్‌లో అద్భుతమైన జీవన వసరులున్న నగరంగా తీర్చిదిద్దేలా కసరత్తు చేస్తున్నాం.

ఇళ్ల కోసం యాప్‌లో నమోదు చేసుకోవాలి

నార్కట్‌పల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన వారు పంచాయతీ కార్యదర్శి వద్ద ఉన్న యాప్‌లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ఉమేశ్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటి స్థలం ఉన్నా లేకున్నా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న స్థానికులు కూడా రెండు వారాల పాటు నిర్వహించే ఇళ్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలన కింద మండలంలోని 29 గ్రామపంచాయతీల నుంచి 12,862 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'మీడియా ప్రతినిధులకు క్షమాపణ చెప్పాలి'

నల్లగొండ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మీడియా ప్రతినిధులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానకర్తగా పనిచేస్తున్న మీడియాపై దాడి సమంజసం కాదని పేర్కొన్నారు. మీడియా స్వచ్ఛను హరించే విధంగా ఎవరూ దాడులకు పాల్పడకుండా కఠిన శిక్షలు అమలు చేయాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పన్నులు చెల్లించకుంటే ఆస్తులు సీజ్ చేస్తాం

● మునిసిపల్ రెవెన్యూ అధికారి శివరాంరెడ్డి



ఆస్తి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ రెవెన్యూ అధికారి శివరాంరెడ్డి కోరారు. ఆస్తి పన్నులు చెల్లించకుంటే ఆస్తులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. వివిధ అంశాలపై గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడారు. ● (రామగిరి- ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఎన్ని గృహాలు ఉన్నాయి

రెవెన్యూ అధికారి: నివాస గృహాలు 35,984 కమర్షియల్ గృహాలు 3,494, రెండు కలిసి ఉన్నవి 24,56, మొత్తం 41,934 గృహాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : వివిధ గృహాల ద్వారా ఏడాది ఆదాయం ఎంత ?

రెవెన్యూ అధికారి: పట్టణంలో ఉన్న 41,934 గృహాల నుంచి ప్రతి సంవత్సరం రూ.16.53కోట్ల ఆదాయం వస్తుంది. ఇప్పటికే రూ.10.24 కోట్లు వసూలు అయ్యాయి.

ఆంధ్రజ్యోతి : పాత బకాయిలు ఎన్ని ఉన్నాయి

రెవెన్యూ అధికారి: ఇప్పటి వరకు రూ.48.28 కోట్ల పాత బకాయిలు ఉన్నాయి. ఒక్కో గృహానికి 2 నెంబర్లు ఉండడం, కొంతమంది యజమానులు స్థానికంగా ఉండకపోవడం, మరికొంత మందివి కోర్టులో కేసులు ఉండడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి.

ఆంధ్రజ్యోతి : వీటిని ఎలా వసూలు చేస్తారు

రెవెన్యూ అధికారి: మొండి బకాయిదారులను గుర్తించి 250మందికి రెడ్ నోటీసులు ఇచ్చాం. రెడ్ నోటీసు అందిన వారం రోజుల్లో స్పందించాల్సి ఉంటుంది. కొంతమంది ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించారు.

ఆంధ్రజ్యోతి: మిగతావారి నుంచి ఎలా వసూలు ఎలా

రెవెన్యూ అధికారి: బిల్ కలెక్టర్లను ప్రతిరోజూ ఇంటింటికీ పంపిస్తున్నాం. కొంతమంది స్పందిస్తున్నారు. స్పందించని వారికి 85, 86, 87, 100(2) మునిసిపల్ చట్టం ప్రకారం వారి ఇంటికి సంబంధించిన నల్లా కనెక్షన్లు కట్ చేయడంతో పాటు అవసరమైతే వారి ఆస్తులను జప్తు చేయాల్సి ఉంటుంది.

చిట్యాల మార్కెట్ చైర్‌పర్సన్‌గా వినోద


నర్రా వినోదామోహన్‌రెడ్డిని అభినందిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల, చిట్యాల రూరల్, డిసెంబరు12, (ఆంధ్రజ్యోతి): చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా వినోదామోహన్‌రెడ్డి నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా ఐతరాజు యాదయ్య, డైరెక్టర్లుగా ధార యాదయ్య, కోనేటి యాదగిరి, రెముడాల యాదయ్య, దుబ్బాక అరుణ, షేక్ కరీంసాబ్, కొండ ఎల్లయ్య తొడుసు వీరయ్య, లెంకల విజయేందర్‌రెడ్డి, బింగి కొండయ్య, నీరుడు రాంరెడ్డి, బూరుగు కృష్ణయ్య, గజ్జెల భాస్కర్ నియమితులయ్యారు. మార్కెటింగ్ సహకార శాఖ ఈ నెల 11వ తేదీన ఉత్తర్వులు జారీచేసింది. ఈ పాలకవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుంది. మార్కెట్ పాలకవర్గం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది.

అయ్యప్ప దీక్ష క్రమశిక్షణకు సోపానం


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారణ దీక్షలు క్రమశిక్షణకు సోపానాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రమణ గురుస్వామి తాంత్రికత్వాన, బెల్లి వెంకన్న ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన 23వ వార్షిక పడిపూజ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతన కోసం దైనందిన జీవితంలో దైవదర్శనం భాగం కావాలన్నారు. అయ్యప్ప దేవాలయంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. భక్తులకు మనిగారడి సుభాశ్(గురుస్వామి) అనిత దంపతులు అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, గురుస్వామి బెల్లి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు బండా సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, ఐతరాజు యాదయ్య, జెరిపోతుల భరత్, బొంబాయి నర్సింహ, ప్రజ్ఞాపురం సత్తి, గురుస్వాములు పూల గురుస్వామి, పెండోట సోమయ్య, పర్రెపాటి సైదులు, బెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలి

శాలిగౌరారం, (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని పావురాలగూడెంలో గురువారం అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాపాక రాజు, అయితగోని వెంకన్నగౌడ్, కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, శేఖర్ బాబు, కల్లూరి నాగరాజు పాల్గొన్నారు.

ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయం

మర్రిగూడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని రాజమండ్రి దైవజనులు డ్రేన్‌హం అన్నారు. మండలంలోని రాజుపేట గ్రామపంచాయతీ పరిధిలో ఆశాపురి కాలనీలోని ఏబీనేజర్ చర్చి సమీపంలో గురువారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కోనేరు ప్రభు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్యార ప్రకాష్, పాలిశెట్టి ప్రకాష్, అబ్రహం, అర్నాల్డ్, మార్కు, అనసీయ పాల్, జోసఫ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయాలి

చిట్యాలరూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేసున్న సంక్షేమ పథకాలను బీజేపీ బూత్ అధ్యక్షులు ప్రచారం చేయాలని ఆ పార్టీ మండల బూత్ కమిటీల ఎన్నికల ఇన్‌చార్జి పీక వెంకన్న, మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్ అన్నారు. మండలంలోని ఉరుమడ్లలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్లతో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. 91వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా జన్నపాల రాంబాబు, 92వ బూత్ అధ్యక్షుడిగా జనగాం స్వామి, 93వ బూత్ అధ్యక్షుడిగా కొయ్యటి సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన లింగస్వామి, ఉయ్యాల లింగస్వామి, సాగర్ల వెంకటేశ్వర్లు యాదవ్, పాలకూర వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

శాలిగౌరారం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఎంటీఏటీఎస్ రాష్ట్ర కన్వీనర్ కుక్కడపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సంపత్‌కుమార్, కృష్ణయ్య, శ్రీను, సంధ్యారాణి, సృజన, సంధ్య, సంగీత, అనురాధ, శ్వేత, శ్రీరాములు, బొడ్డు మల్లేష్ పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

నకిరేకల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం నకిరేకల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి పోటీలను ప్రారంభించి క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి మేక నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు అన్నారు. కట్టంగూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అంబటి అంజయ్య, విజయ్ కుమార్, శ్రీనివాస్, మాణిక్యం, రాజశేఖర్‌రెడ్డి, పుల్లయ్య ఉన్నారు.

నార్కట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ పోటీలను ఎంఈవో కూకుట్ల నర్సింహ గురువారం ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న వారిలో 120 మందిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం డీ. నరేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు రామస్వామి, శ్రీనివాస్, శంభు లింగం, ఇమామ్‌కరీం, నుస్రత్ సుల్తానా పాల్గొన్నారు.

చిట్యాలరూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండల స్థాయిలో క్రీడా పోటీలు మండలంలోని పెద్దకాపర్తిలో నిర్వహించారు. విజేతలకు మండల విద్యాధికారి పానుగోతు సైదానాయక్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లుకేందర్‌రెడ్డి, బ్రహ్మయ్య, శ్రీదేవి, వెంకటరమణ, జానకి, అబ్దుల్ గఫార్, రాజు పాల్గొన్నారు.


కట్టంగూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో

కట్టంగూరు, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో జ్ఞానప్రకాశ్ రావు అన్నారు. కట్టంగూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ పోటీలను ప్రారంభించారు.

ఆయకట్టుకు నీటి విడుదల

కనగల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కనగల్ షైలసముద్రం చెరువు ఆయకట్టుకు అధికారులు గురువారం సాగునీటిని విడుదల చేసారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా గతేడాది చెరువు పూర్తిగా ఎండి రైతులకు ఇబ్బందులు ఎదు రైనట్లు వివరించారు. ఆయకట్టుకు నీటి విడుదల పట్ల కనగల్, తేలకం టిగూడెం, తిమ్మన్నగూడెం, ఎస్‌లింగోటం గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ సాజియా, వర్క్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బిక్షంయాదవ్, ఏఎంసీ డైరెక్టర్ కరీంముల్లా, నాయకులు నర్సింగ్ క్రిష్ణయ్యగౌడ్, బోగరి రాంబాబు, హఫీజుద్దీన్ సింగం పెద్దులు, కొంపల్లి శంకర్, వెంకన్న ఉన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్, డైరెక్టర్లకు సన్మానం

కేతేపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్‌గా నియమితులైన గుత్తా మంజులమాధవరెడ్డి గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను క్యాంపు కార్యాలయంలో కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. చైర్‌పర్సన్‌తో పాటు కేతేపల్లి మండలం నుంచి మార్కెట్ డైరెక్టర్లుగా నియమితులైన బయ్య ముత్తయ్య, ఎస్‌కె. లతీఫ్, కప్పల సైదులు, ఎం. పరశురాములులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసయాదవ్, నాయకులు బొజ్జ సుందర్, ఎన్. మంగమ్మ, బడుగుల నరేందర్, జె. వెంకటనర్సయ్యయాదవ్, పుల్లయ్య, మట్టి సాల్మన్, కందుల మోహన్, ఎడ్ల రమేష్, పి.శేఖర్, ఎడ్ల ప్రవీణ్, కుమ్మరి నాగయ్య, బయ్య అంజయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మునుగోడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మునుగోడు శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామానికి చెందిన యనమల్ల సురేష్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఆక్సిజన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మునుగోడు మండలం సింగారం గ్రామంలో తన బంధువుల శుభకార్యానికి వచ్చి తిరిగి రాత్రి విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనంపై జిల్లాకేంద్రానికి బయలుదేరాడు. మునుగోడు శివారులోని గోపిరెడ్డిని బావి మూలమలుపు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కేతేపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. మండలంలోని 16 గామపంచాయతీల నుంచి ప్రజాపాలనలో నివాస గృహాల కోసం 10540 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే సం దర్భంగా ఆయా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి ప్రస్తుత ఇంటి స్థితిగతులు పరిశీలించి రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఇంటి స్థలం డాక్యుమెంటు, విద్యుత్ బిల్లు, ఇంటి పన్ను రశీదుల్లో ఏదైనా ఒకటి తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మండలంలోని 330మంది దరఖాస్తుదారులను సర్వే చేశారు. కేతేపల్లిలో గురువారం ఎంపీడీవో బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వే వేగవంతం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జె. వెంకటనర్సయ్యయాదవ్, ఎ.మహేందర్‌రెడ్డి ఉన్నారు.

అధికారులు పత్తి కొనుగోలు చేయడం లేదు

మర్రిగూడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రానికి తాము తెచ్చిన పత్తి కొనుగోలు చేయకుండా సీసీఐ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పత్తి మిల్లుల వద్ద ఆందోళన చేశారు. మండలంలోని రెండు పత్తి కొనుగోలు కేంద్రాల అధికారులు కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం లేదంటూ 10క్వింటాళ్లకు తరుగు పేరుతో క్వింటా పత్తి కోత విధిస్తున్నారని ఆరోపించారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతు న్నామని ఆవేదన వ్యక్తంచేశారు. దళారులు పత్తి మిల్లుల వద్దకు తీసుకవచ్చిన పత్తిలో 20శాతం తేమ ఉన్నా ఆ పత్తి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపి స్తున్నారు. సీసీఐ అధికారులు, మిల్లుల యజమానులు కుమ్మకై దళారులపై మొగ్గు చూపుతున్నారని దీని వల్ల రైతులు మిల్లుల వద్ద మూడు రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీసీఐ కేంద్రం అధికారులు దళా రులవైపు మొగ్గు చూపకుండా రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని రైతులు మిల్లుల వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీస్ అధికారులు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్పందించిన పోలీసులు సీసీఐ అధికారులతో మాట్లాడి ఇలాంటివి పునరావృత్తం కాకుండా రైతులు తెచ్చిన పత్తి తేమశాతం చూసి కొనుగోలు చేయాలని తెలిపారు. తిరిగి పత్తి కొనుగోలు చేయడంతో రైతులు ఆందోళన విరమించారు.


కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

సంక్షిప్తం

తిప్పర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పేదల వెంటే ఉంటానని తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్ అన్నారు. ఆయన సోదరుడు రామచంద్రంగౌడ్ 31వ వర్ధంతి సందర్భంగా ఆయన ఘాట్ వద్ద గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా నాయకుడు తండు నరసింహగౌడ్ పాల్గొన్నారు.

నాంపల్లి, (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ కేంద్రాల ఏర్పాటుపై మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు స్వీకరించినట్లు ఎంపీడీవో స్వర్ణ మేరికుమారి గురువారం తెలిపారు. ఇబ్బందులుంటే పార్టీల నాయకులు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో ఝాన్సీరెడ్డి, నాయకులు నేతాళ్ల కొండల్, నక్క చంద్రశేఖర్, సుందనబోయిన రమేష్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్, (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న సాయి బాబా మందిరంలో నిర్వహించే శ్రీదత్తాత్రేయ స్వామి జయంతి, సాయి స్వాముల మండల పూజ కార్యక్రమాల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి కోశాధికారి ఉప్పల వెంకటరమణ, బండారు వేణుగోపాల్, రాంబాబు, పోతుల రాములు, రామచొక్కం పాల్గొన్నారు.

చిట్యాలరూరల్, (ఆంధ్రజ్యోతి): సదీష ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణితంలో ప్రతిభ పరీక్ష నిర్వహించారు. చిట్యాల మండలంలోని నేరడ గ్రామ జెడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థిని పి. అభినయశ్రీ ఎంపికైంది.

సీఐటీయూలో చేరిక



నల్లగొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు బీఆర్‌టీయూ నుంచి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి సమక్షంలో గురువారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐటీయూలో చేరిన వారిలో టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటేశం, జిల్లా నాయకుడు శివ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జంజిరాల శ్రీనివాస్, శ్రీనివాస్, దండెంపల్లి సత్తయ్య, రవీందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సింహాచార్యులుకు అర్చక శిరోమణి అవార్డు



నార్కట్‌పల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాండ్ర గ్రామానికి చెందిన పురోహితుడు ఉత్తరాపల్లి నర్సింహాచార్యులకు ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ అర్చక శిరోమణి అవార్డు ప్రదానం చేసింది. అర్చకత్వంతో పాటు జ్యోతిష్య శాస్త్రంలో పరీక్షలు నిర్వహించి ఎంపికైన వారికి తిరుపతిలోని మహతీ ఆడిటోరియంలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన టీటీడీ ప్రధాన అర్చకుడు రంగాచార్యులు నుంచి అవార్డు, ప్రశంసా పత్రం అందుకు న్నారు. కార్యక్రమంలో నర్సింహ్మస్వామి, నారాయణచార్యులు, గోపీనాథ్, అరుణ్, మహేశ్, రమణారావు, కృష్ణమూర్తి, కేశవరావు, రమణాచారి, నవీనశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎంను కలిసిన ఎంప్లాయీస్ యూనియన్ బృందం

నల్లగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆర్ఎం కె. జానిరెడ్డిని ఆర్ఎం కార్యాలయంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్‌గా నియమితులైన వి. లింగస్వామిని కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బాసాని వెంకటయ్య, రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. జమాల్‌గౌడ్, ఎస్ఆర్‌సీ రాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ రెడ్డి, ఏఎల్ స్వామి, ఎస్‌కె. అసన్‌బాబా, బి. లూర్థమ్మ, శంకరమ్మ, లింగయ్య, కుమార్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

మర్రిగూడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కృష్ణారెడ్డి హెచ్చరించారు. మండలకేంద్రంలో కొంతమంది మైనర్లు గురువారం ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడడంతో వాహనాలు స్వాధీనం చేసుకొని పిల్లల తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, ఇస్తే కేసు నమోదు చేస్తామన్నారు.

కేసీఆర్‌ను కలిసిన నాయకులు



శాలిగౌరారం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ మండల నాయకులు ఎర్రవల్లిలోని హౌస్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు కట్ట వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్, గురిజాల మాజీ సర్పంచ్ గుండా శ్రీనివాస్ కలిసి సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేసీఆర్ సూచించారు. కార్యక్రమంలో నాయకులు యల్మకంటి యాదయ్య, ముత్యాల వెంకన్న, దొనకొండ అంజయ్య ఉన్నారు.


భాషా వికాసానికి కృషిచేయాలి

నకిరేకల్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పిల్లల మానసిక వికాసానికి భాష కీలకపాత్ర వహిస్తుందని, మాతృభాషా వికాసానికి తెలుగు భాష ఉపాధ్యాయులు కృషిచేయాలని మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. మండలంలోని నోముల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన తెలుగుబాష ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం మిర్యాల చల్మరాజు, రిసోర్స్ పర్సన్లు పొడిచేటి శంకర్, బి. వెంకటేశం, ఉపాధ్యాయులు చిన్ని శ్రీనివాస్, గఫూర్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, వెంకటయ్య, రవీందర్, వేణుగోపాల్, మధుసూదన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విద్యుత్ లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సాగర్‌రోడ్డులో గల రుద్రమదేవికాలనీ, తెలంగాణకాలనీ, హిమగిరికాలనీ, గోకుల్‌నగర్, బ్లూహిల్స్, ఇంద్రారెడ్డి రైస్‌మిల్, రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఎం. వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 13 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 78

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	180	200
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 19.4

ఇక్కడ శిక్షణతో.. యువత సెట్‌విన్

● 26 కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు నల్లగొండలో సెట్విన్ కేంద్రం ● కంప్యూటర్స్, ఫ్యాషన్‌డిజైనింగ్, బ్యుటీషియన్, టెక్నికల్ విభాగాల్లో కోర్సులు



నల్లగొండ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థ

నల్లగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా యువతకు ఉపాధి కల్పన కోర్సులనందించేందుకు సెట్విన్ శిక్షణా కేంద్రం సిద్ధమైంది. 26 రకాల కోర్సుల్లో ఇక్కడ నిరుద్యోగ యువతకు శిక్షణ అందించేందుకు రంగం సిద్ధమైంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఏడో తరగతి నుంచి ఇంటర్‌వరకు మాత్రమే చదివి సరైన ఉపాధిలేక ఇబ్బందిపడే యువతకు ఈ కోర్సుల్లో శిక్షణ పొందడం ద్వారా తక్షణ ఉపాధి పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణనందించే నిమిత్తం 1978లో ఏర్పాటైన సెట్విన్ 26వ శిక్షణా కేంద్రాన్ని ఇటీవల నల్లగొండలో ప్రారంభించింది. జిల్లాలో యువత, నిరుద్యోగులు చెడుమార్గం పట్టకుండా, స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకునేందుకు ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలో.. మిగతా 7వ పేజీలో..


నల్లగొండ జిల్లాకేంద్రంలోని సెట్విన్ సెంటర్‌లో సిద్ధం చేసిన కారు రిపేర్ సామగ్రి


నల్లగొండ జిల్లాకేంద్రంలో సమ్మెలో పాల్గొన్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు

స్తంభించిన విద్యాశాఖ

- సమగ్రశిక్షకుల సమ్మె కారణం
- కనీస డిమాండ్లు పరిష్కరించాలంటున్న శిక్షకులు
- ఇలాగే కొనసాగితే కేజీబీవీలు మూతవేయాల్సిందే

విద్యాశాఖకు వెన్నెముక లాంటి సమగ్రశిక్ష అభియాన్ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉద్యోగభద్రత కల్పించాలని సమ్మెకు దిగడంతో పాలన స్తంభించింది. వారం రోజులుగా నిరవధికంగా ఆందోళనలు, ధర్నాలు, సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం వీరిని చర్చలకు పిలవలేదు. దీంతో సమ్మె ఉధృతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మెతో విద్యాశాఖలో ఎక్కడికక్కడ ఫైళ్లు నిలిచిపోయాయి. మండల రిసోర్స్ కేంద్రాలు, భవిత్ కేంద్రాలు మూతపడ్డాయి. కేజీబీవీలలో విద్యాబోధన కుంటుపడింది. అదేవిధంగా స్కూల్ కాంప్లెక్స్‌లో సీఆర్పీలు లేక ఏ పనులూ జరగడం లేదు. పాఠశాలల్లోనూ ఆర్ట్ టీచర్లు, పీఈటీలు లేరు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మొత్తం విద్యాశాఖ స్తంభించే పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. అయితే సమ్మెకు దిగిన సమగ్రశిక్షకులు మాత్రం వారి న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఈ మేరకు హామీ కూడా ఇచ్చిందని, ఇప్పుడు దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని, వాటిని నెరవేర్చకుంటే సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

జిల్లా కార్యాలయం మొదలు పాఠశాల స్థాయి వరకు

సమగ్రశిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు విద్యాశాఖలో జిల్లా కేంద్ర కార్యాలయాలు మొదలు పాఠశాలస్థాయి వరకు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టమ్ ఎనలిస్టులు, టెక్నికల్ పర్సన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డీఎల్‌ఎంటీలు, మెసెంజర్లు విధులు నిర్వహిస్తున్నారు. డీఈవో కార్యాలయం మొదలు ఆయా అనుబంధ కార్యాలయాల్లో వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. మండల స్థాయిలో మండల విద్యావనరుల కేంద్రాలు, భవిత కేంద్రాల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, మెసెంజర్లు పనిచేస్తున్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలల్లో ఆర్ట్ టీచర్లు, పీఈటీలు, వర్క్ ఎడ్యుకేషన్ వలంటీర్లు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లుగా సేవలందిస్తున్నారు. అదేవిధంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో స్పెషలాఫీసర్లు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్లు, క్రాఫ్ట్, కంప్యూటర్ మిగతా 7వ పేజీలో...

కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలి




అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 సెప్టెంబరు 13న నాటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో మా ధర్నా శిబిరం వద్దకు వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగభద్రతకల్పిస్తామన్నారు. ఆ హామీని అమలు చేయాలని కోరుతున్నాం. మా సమస్యలపై అవగాహన ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మా డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్నాం.

ఎం.కృష్ణ, తెలంగాణ సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఎస్‌ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల

పూర్తయ్యేదెన్నడో?

● ఏళ్లుగా ముందుకుసాగని ప్రాజెక్టుల పనులు


సామర్థ్యం పెంపునకు నోచుకోని పెండ్లిపాకల రిజర్వాయర్

దేవరకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగమార్గంలో భాగంగా చేపట్టాల్సిన ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనులు ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడంలేదు. 2015లో రూ.343కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పనులను ప్రారంభించగా నేటికీ 40శాతం పనులు కూడా పూర్తికాలేదు. ఈ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేయడంతో రీటెండర్లు పిలిచి మరో కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

శ్రీశైలం నుంచి వచ్చే కృష్ణాజలాలు నాగర్‌కర్నూల్ జిల్లా మన్నెవారిపల్లి వద్ద టన్నెల్-1 అవుట్‌లెట్ నుంచి నక్కలగండి రిజర్వాయర్‌కు చేరుతాయి. అక్కడి నుంచి ఓపెన్ కెనాల్ ద్వారా తేల్‌దేవరపల్లి సమీపంలోని టన్నెల్-2 ఇన్‌లెట్‌కు నీరు వెళ్లాలి. ఇక్కడి నుంచి నేరేడుగొమ్ము మండలం టన్నెల్-2 అవుట్‌లెట్ ఓపెన్ కెనాల్ ద్వారా పెండ్లిపాకల ప్రాజెక్టుకు నీరు చేరుతుంది. పెండ్లిపాకల ప్రాజెక్టు నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ ప్రధాన కాల్వకు నీరు వెళ్తుంది. అయితే టన్నెల్-2 అవుట్‌లెట్ నుంచి పెండ్లిపాకల వరకు 4కిలోమీటర్లు, పెండ్లిపాకల, అక్కంపల్లి రిజర్వాయర్ వరకు 18కిలోమీటర్ల మేర ఓపెన్ కెనాల్ మిగతా 8వ పేజీలో...

ఏబీటీవో అంతర్జాతీయ అధ్యక్షుడిగా లక్ష్మయ్య



బీహార్ రాష్ట్రంలోని వైశాలిలో జరిగిన సదస్సులో ఏబీటీవో అంతర్జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేపల్లి లక్ష్మయ్యను అభినందిస్తున్న నిర్వాహకులు

నాగార్జునసాగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బుద్ధిస్ట్ టూర్స్ ఆపరేటర్స్ అసోసియేషన్ (ఏబీటీవో) అంతర్జాతీయ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త మల్లేపల్లి లక్ష్మయ్య నియమితులయ్యారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీవరకు బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా కేంద్రంలో జరిగిన 7వ ఏబీటీఓ అంతర్జాతీయ సదస్సులో అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం ప్రత్యేక అధికారిగా ఉన్న సమయంలో బౌద్ధమత వ్యాప్తికి లక్ష్మయ్య చేసిన కృషికి గుర్తింపుగా ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2015వ సంవత్సరంలో బీహార్ రాష్ట్రంలోని నలందలో ఏబీటీవో ప్రధాన కార్యాలయం ఏర్పాటుచేశామని, బౌద్ధ పర్యాటకాన్ని ప్రోత్సహించడం, సాంస్కృతిక వారసత్వాన్ని పర్యవేక్షించడం ప్రధాన ఉద్దేశ్యమని సంస్థ నిర్వాహకులు చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన ఏబీటీఓ వ్యవస్థాపకుడు డాక్టర్ కౌలేష్‌కుమార్‌కు మల్లేపల్లి లక్ష్మయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

● కనకమహాలక్ష్మీగా..



కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు మార్గశిర మాసం గురువారం పురస్కరించుకుని కనకమహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చీరసారె, ఒడిబియ్యం, బోన నైవేద్యాలను సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.

● ఆంధ్రజ్యోతి, కనగల్

ఎగుమతులపై దృష్టి సారించాలి : కలెక్టర్


కనగల్‌లో జెండా ఊపి 108 వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎగుమతులకు అనువైన ఉత్పత్తులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎగుమతులకు అనువైన ఉత్పత్తులు, క్లస్టర్ల అభివృద్ధికి అనువైన పరిస్థితులను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎగుమతుల విషయంలో స్వయం సహాయక మహిళా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తామని, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాలు ఉత్పత్తుల విషయంలో ముందుకు వస్తే వారికి అవసరమైన భూమిని తక్కువ ధరకు ఇస్తామని తెలిపారు. ఎఫ్‌ఐఈవో కులకర్ణి మాట్లాడుతూ, ఎగుమతులకు అనువైన పరిశ్రమల ఏర్పాటు గురించి, వాటి విధానాలను వివరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్, హార్టికల్చర్ డీడీ సాయిబాబా, కట్టంగూరు ఎఫ్‌టీవో అధ్యక్షుడు నంద్యాల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): ప్రభుత్వం మంజూరు చేసిన 108 వాహనాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం కనగల్ పీహెచ్‌సీలో 108 అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అత్యవసర ప్రమాద సమయాల్లో బాధితులను ఆసుపత్రికి తరలించడమే అంబులెన్స్ సిబ్బంది ప్రధాన లక్ష్యమన్నారు. కొత్త వాహనంలో అధునాతన వైద్య సౌకర్యాలు ఉన్నాయన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన నూతన భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాతభవనం నుంచి కొత్త భవనంలోకి మారేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు వ్యవసాయ సబ్ మార్కెట్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, వైద్యుడు రామకృష్ణ, ఆర్‌ఐలు సునిత, యాదగిరి, తదితరులున్నారు.

ఉమ్మడి జిల్లాలో బైక్ ట్యాక్సీలు

రయ్ రయ్



ఇన్నాళ్లు నగరాలకే పరిమితమైన ర్యాపిడో సౌకర్యం జిల్లాకేంద్రాలకు చేరువైంది. అత్యవసర సమయంలో, అడ్రస్ తెలియని వాళ్లకు అత్యంత ముఖ్యమైన ఈ ర్యాపిడో వాహన సౌకర్యం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదలైంది. 6

ఉత్సవాలను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

కొండమల్లేపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వంద వసంతాల ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 30న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చెన్నారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీపీఐ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. ఎస్‌ఎల్‌బీసీ, పెండ్లిపాకల ప్రాజెక్టు, కిష్టరాయన్‌పల్లి ప్రాజెక్టు పనులను ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, కల్లు చరణ్‌రెడ్డి, వీరస్వామి, పరిపూర్ణచారి, పాల్గొన్నారు.

రేపు బీసీల రౌండ్ టేబుల్ సమావేశం

నల్లగొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నేపథ్యంలో బీసీల భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వీరేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ నాయకులను పెద్ద సంఖ్యలో గెలిపించుకునేందుకు బీసీ రాజ్యాధికార సమితి క్షేత్ర స్థాయిలో గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి వరకు ఇన్‌చార్జీలను నియమించనున్నట్లు తెలిపారు. 14న నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ హాజరువుతున్నారని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ కర్నాటి యాదగిరి, మార్గం సతీష్‌కుమార్, లింగంపల్లి చిరంజీవి, కొడుపుగంటి శ్రీధర్, గడగోజు విజయచారి, కర్నాటి జితేందర్, చిన్నోజు రాజు, దీకొండ నవీన్‌కుమార్, ఖమ్మం అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): 33 కేవీ ఏ.ఈ.హెచ్.టీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హాలియా, యాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హాలియా ఏఈ ధన్‌రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు సీఎం కప్ పోటీలు

డిండి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ టోర్నమెంట్ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్రీడలు ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. క్రీడలు జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

● మాడ్గులపల్లి : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తిరు మలస్వామి తెలిపారు. స్థానిక సెవెంత్ డే స్కూల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీల్లో భాగంగా మండల స్థాయిలో క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈవో వెంకటమ్మ, ఎస్ఐ కృష్ణయ్య, పీడీ రవీందర్ పాల్గొన్నారు.

అల్లం కిరణ్ వర్ధంతి సభ

మిర్యాలగూడ, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): అల్లం కిరణ్ వర్ధంతి సభను స్థానిక లోటస్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు అల్లం కిరణ్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేతనపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రక్తప్రసరణపై రసాయనాల ప్రభావం' అనే అంశంపై అమెరికా లూసియానా స్టేట్ యూనివర్సిటీలో శాస్త్ర పరిశోధనలు చేస్తూ 2007 డిసెంబర్ 13న ఆగంతకులు జరిపిన కాల్పుల్లో మృతి చెందినట్లు చెప్పారు. కిరణ్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ట్రస్ట్ ద్వారా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రతి ఏటా సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించనున్న సభకు మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, విరసం కవి రాజయ్య హాజరుకానున్నట్లు వివరించారు.

రేపటి నుంచి కాశీనాయన ఆరాధనోత్సవాలు

నాగార్జునసాగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ రైట్ బ్యాంకు టీ జంక్షన్ వద్ద ఉన్న కాశీనాయన స్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు శనివారం నుంచి రెండ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు రంగస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న మధ్యాహ్నం 3 నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు ఆరాధనోత్సవాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. 15న ఉత్సవాల ముగింపు సందర్భంగా మహాన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి వ్యవస్థాపకులు కోరారు.

' రాజ్యాంగ ప్రతులు చింపిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలి '

దేవరకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాజ్యాంగ ప్రతులు చింపిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. రాజ్యాంగాన్ని అవమానించడాన్ని నిరసిస్తూ గురువారం దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్ర హం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. రాజ్యాంగాన్ని చింపడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అవమానపరచడమే అన్నారు. కార్యక్రమంలో భాస్కరచారి, అంకం చంద్రమౌళి, రాములు, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుగొమ్ముకు పీహెచ్‌సీ కలేనా ?

» వైద్యం కోసం చందంపేట, దేవరకొండకు వెళ్లే పరిస్థితి » అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నేరేడుగొమ్ము, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): నేరేడుగొమ్ము మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు కలగానే మారింది. మండల కేంద్రం ఏర్పడి 8 ఏళ్లు అవుతున్నా పీహెచ్‌సీ లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వైద్యం కోసం ఉమ్మడి చందంపేట మండలంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే నేరేడుగొమ్ము మండల ప్రజలు ఆశ్రయిస్తున్నారు. కాచరాజుపల్లి, పెద్ద మునిగల్, వైజాగ్‌కాలనీ, కొత్తపల్లి తదితర గ్రామాల ప్రజలు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న చందంపేటకు, 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరకొండకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. పేరుకే నేరేడుగొమ్ము మండల కేంద్రం అయినప్పటికీ వైద్యసేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.



నేరేడుగొమ్ము మండలకేంద్రం

అప్పటి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి స్వగ్రామం నేరేడుగొమ్ము కావడంతో 2016లో నేరేడుగొమ్మును మండలంగా ఏర్పాటు చేశారు. మొత్తం 19 గ్రామపంచాయతీలతో మండల కేంద్రంగా కొనసాగుతుంది. మండల జనాభా 21,661 మంది ఉన్నారు. కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందని పరిస్థితి. అత్యవసర చికిత్స అందక మం డల ప్రజలు మృత్యువాత పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యం అందిస్తున్నాం

నేరేడుగొమ్ము మండలం నుంచి వస్తున్న రోగులకు వైద్యసేవలు అంది స్తున్నాం. చందంపేట ఉమ్మడి మండలం కావడంతో రోగుల సంఖ్య రోజు, రోజుకు పెరుగుతోంది. ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక డాక్టర్ లేకపో వడంతో అధిక భారం పడుతోంది. సిబ్బంది కొరత కూడ ఉంది.

- డాక్టర్ చందులాల్, వైద్యాధికారి, చందంపేట

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడం, సకాలంలో వైద్యం అందక మారుమూల గ్రామాల ప్రజలు మృత్యువాత పడుతున్నారు. వైజాగ్‌కాలనీ, పెద్దమునిగల్‌కు విహారయాత్రకు వచ్చిన యాత్రికులు కృష్ణానదిలో ఈతకు వెళ్లి అనేక మంది మృతి చెందారు. మండల కేంద్రంలో ఆసుపత్రిని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలి. రాజేష్, వైజాగ్‌కాలనీ

వ్యర్థాలను ప్రయోజనకరంగా మార్చాలి : ఎమ్మెల్యే



మునిసిపల్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డ్‌లో చెత్త శుద్ధీకరణ చేపట్టి వ్యర్థాలను ప్రయోజన కరంగా మార్చాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. స్థానిక ఈదులగూడెం డంపింగ్ యార్డ్‌ను, వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గతంలో చెత్తను తరలించే మున్సిపల్ వాహనాలు కూడా డంపింగ్ యార్డ్‌లోకి వెళ్లే వీలు లేకుండా ఉండేదని అన్నారు. అంతేకాకుండా చెత్తను కాల్చడం ద్వారా వెలువడే పొగ వల్ల డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల నివసించే ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారని పేర్కొన్నారు. యార్డ్‌లోపలికి వాహనాలు వెళ్లేవిధంగా అడ్డంగా ఉన్న చెత్తను తొలగించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తగుల బెట్టకుండా నివారించి పొగ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. చెత్తద్వారా కంపోస్టు ఎరువులను తయారుచేసే విధంగా వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరువేరుగా ఉంచి పారిశుధ్య కార్మికుల వాహనాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ .యూసూఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, కార్మికులు పాల్గొన్నారు.

నైపుణ్యాల వెలికితీతకు ఎగ్జిబిషన్ దోహదం



ప్రదర్శనను తిలకిస్తున్న ఎస్ఈ రామకృష్ణారెడ్డి

నాగార్జునసాగర్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి ఇంటిగ్రేటెడ్ ఎగ్జిబిషన్ దోహదం చేస్తున్నదని జెన్‌కో ఎస్ఈ రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పైలాన్ కాలనీలో జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఏవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. ఈ ప్రదర్శనలో తెలుగు, హిందీ, గణితం సబ్జెక్టుకు సంబంధించిన రకరకాల మోడల్స్‌ను ప్రదర్శించారు. ఇంగ్లిష్ వ్యాకరణానికి సంబంధించిన, సాంఘిక శాస్త్రం అనుగుణంగా వాటర్ ప్యూరిఫికేషన్, భూకంప లేఖిని వంటి నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలకు ఎస్ఈ బహుమతి ప్రదానం చేశారు. హెచ్ఎం వాసుదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు

దేవరకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కొండభీమనపల్లికి చెందిన ఎర్ర ఆంజనేయులును నియమిస్తూ టీఎస్ ఎమ్మార్పీఎస్ దక్షిణ రాష్ట్ర అధ్యక్షుడు చింతబాబు మాదిగ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంజనేయులు 15 ఏళ్లుగా దండోరా ఉద్యమంలో పనిచేస్తూ ఎమ్మార్పీఎస్ గ్రామ, మండలశాఖ అధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

సీపీఐ సభ్యత్వ నమోదు

డిండి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఐ సభ్యత్వ నమోదును మం డలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టినట్లు ఆపార్టీ మండల కార్యదర్శి శ్రీరామ దాసు కనకచారి గురువారం తెలిపారు. మండలంలోని శేషాయికుంట గ్రామంలో నిర్వహించిన సమావేశంలో సభ్యత్వాలు పునరుద్ధరణ చేశారు. గ్రామ, గ్రామాన సభ్యత్వం పునరుద్ధరించుకోవాలని కార కర్తలకు సూచించారు. కార్యక్రమంలో బొల్లె శైలేజ్, ఎనమళ్ల నవీన్, చంద్రయ్య, బండి అంజయ్య, ఇద్దయ్య, అనిల్, ఓర్సు శ్రీను, చెరుకూరి ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నాయకుని తండా లోని పేదలకు దత్తాత్రేయస్వామి మాలధారణ స్వాముల గురువారం అన్న దానం చేశారు. యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మునినాయక్ పాల్గొని మాట్లాడారు. గ్రామ పెద్దలు బిచ్యాల టనాయక్, నాగేందర్‌నాయక్, దేవుజానాయక్, మధునాయక్, స్వామినాయక్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



దేవరకొండ వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

దేవరకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యాన్ని అందించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. యశోద ఆసు పత్రి ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాటాడారు. శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, పాండరయ్య, గాజుల రాజేష్, చీదెళ్ల వెంకటేశ్వర్లు, రవికుమార్, మల్లయ్య, రుక్మా రెడ్డి, నీల బుచ్చయ్య, యశోద ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

నేరేడుగొమ్ము : మండలంలోని పెద్దమునిగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల కార్యదర్శి కేతావత్ రవీందర్ ఈనెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ గురువారం రవీందర్‌ను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పంబాల అంజయ్య, బొడ్డుపల్లి కృష్ణ, కుంభం నరేష్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



దేవరకొండలో మాట్లాడుతున్న డాక్టర్ రుక్మిణిరావు

దేవరకొండ, డిసెంబరు12 (ఆంధ్ర జ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గ్రామ్య సంస్థ డైరెక్టర్ డాక్టర్ రుక్మిణీరావు అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా దేవర కొండలో గ్రామ్య రిసోర్స్‌సెంటర్ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవ గాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి విశ్వమానవ హక్కుల ప్రకటన ద్వారా జాతి, మత, లింగ వివక్షత లేకుండా అందరికీ సమానమైన హక్కులు కలిగి ఉండాలని సూచించారని గుర్తు చేశా రు. మానవ హక్కుల పరిరక్షణ కోసం పరస్పర సమకారం, తోడ్పాటుతో హక్కులను పరిరక్షించుకోవచ్చునని ఆమె అన్నారు. మహిళల హక్కులే మానవ హక్కులుగా గుర్తించాలన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం కోసం కోర్టులతోపాటు మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు చేయ బడ్డాయని ఆమె తెలిపారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగినవారికి హక్కుల కమిషన్ ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో గ్రామ్య ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుమలత, సఖి సిబ్బంది సునీత, గీత పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి

పెద్దవూర, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సొంత ఖర్చు లతో అందించిన దుప్పట్లను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం పంపి ణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, మండలాధ్య క్షుడు యాదగిరిగౌడ్, గుంటుక వెంకటరెడ్డి, సువర్ణరెడ్డి, ఉంగరాల శ్రీను, నాగరాజు యాదవ్, మేకల శ్రీకాంత్, రేపా కుల సాయికుమార్, కిలారి మురళి, కోట అంజి, నాగయ్య, రవిగౌడ్, రంజాన్, వినోద్ పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణి వైశాలికి సన్మానం



వైశాలిని సన్మానిస్తున్న ఎంఈవో బాలాజీనాయక్.

దామరచర్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన నూక ల వైశాలి రాష్ట్ర స్థాయి ఖోఖో జూనియర్స్ -18 జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడంతో ఎంఈవో బాలాజీనాయక్ గురువారం శాలువా, మెమెంటోతో సన్మానించారు. మండల స్థాయి సీఎం కప్ క్రీడల ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను సన్మానించారు కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరెడ్డి, పీఈటీలు నాగలక్ష్మి, రాంరెడ్డి, షమ్మీ ముక్తల్, సురేష్, రాము, స్వాతి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎత్తిపోతల నిర్వహణపై నిర్లక్ష్యం వీడాలి



ఎల్-16ను పరిశీలించి మాట్లాడుతున్న మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధని

వేములపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమకాల్వపై గల ఎత్తిపోతల నిర్వహణ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని వీడాలని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. సాగర్ ఎడమకాల్వపై గల ఎల్-16 ఎత్తిపోతల పథకాన్ని గురువారం ఆమె రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. మండలంలో సుమారు పది ఎత్తి పోతలు ఉండగా ఎల్-13, 15, 16 ఎత్తిపోతల పథకాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, పలు మోటార్లు మరమ్మతులకు నోచు కోకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆమె అన్నారు. ఎల్-16 పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురై రెండునెలలుగా సరైన నీటి సరఫరా లేక చివరి భూములకు నీరందడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిరుమల్ల భిక్షం, చంద్రయ్య, రేణయ్య, పిచ్చిరెడ్డి, రేణుక, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయాలి : సీపీఎం



విలేకరులతో మాట్లాడుతున్న మల్లేష్

మిర్యాలగూడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ పట్టణంలో ఏడాది కాలంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద పట్టణానికి అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.57కోట్లు మంజూరు కాగా, టెండర్లు పిలిచి అగ్రిమెంట్లు పూర్తి చేసినా పనులను ఎన్నికల కోడ్‌తో నిలిపివేశారన్నారు. ఎన్నికలు ముగిసి ఏడాదైనా ఆ పనులను తిరిగి ప్రారంభించలేదన్నారు. ఈ నిధులతో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సివుండగా ఇప్పటివరకు పట్టించుకోకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మున్సిపాలిటీలో రాజకీయ వివాదాల కారణంగా పట్టణం అభివృద్ధికి నోచుకోక ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ 1వ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, సీఐటీయూ నాయకులు గుణగంటి రామచంద్రు, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సూచనలు ఇవ్వాలి

దేవరకొండ, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలు మార్పులు, చేర్పులు చేసే విషయంలో రాజకీయ పార్టీల నాయకులు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎంపీడీవో డానియేల్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై జరిగిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ మండలంలో 41 గ్రామపంచాయతీలకు 306 పోలిం గ్ కేంద్రాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. సమావే శంలో కాంగ్రెస్, బీజేపీ, జనసేన, సీపీఐ, టీడీపీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



దేవరకొండ సమావేశంలో మాట్లాడతున్న ఎంపీడీవో డానియేల్

ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలి

పెద్దఅడిశర్లపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని ఎంపీడీవో చంద్రమౌళి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఓటర్ జాబితా తయారీపై వివిధ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి మండలంలో 35 గ్రామ పంచాయతీలు 304 వార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. 37 గ్రామ పంచాయతీలకు అంగడిపేట ఎక్స్‌రోడ్డు, వద్దిపట్ల గ్రామ పంచాయతీ వార్డులు పెండింగ్‌లో ఉన్నట్లు వారు తెలిపారు. గుడిపల్లి మండలంలోని సింగరాసిపల్లి గ్రామంలో పోలింగ్ బూత్‌కు పక్కా భవనం లేకపోవడంతో ప్రైవేటు భవనం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మదారిగూడెంలో పాత పోలింగ్ బూత్‌లోనే మడిగెలు ఏర్పాటు చేసి అక్కడే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో కాంగ్రె స్ మండలాధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, జయరాములు, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

● చింతపల్లి : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుజాత అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయ కులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో ఎన్నికల నేపథ్యంలో వార్డుల వారీ గా జాబితాను సిద్ధం చేశామని ఆమె తెలిపారు. మండలంలో మొత్తం 33 గ్రామపంచాయతీలకు సంబంధించి 270 పోలింగ్ కేంద్రాల్లో 41,726 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుటకు ప్రణాళిక రుపొందించామన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి



దేవరకొండలో విజేతలకు బహుమతి అందిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ

దేవరకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అన్నారు. గురువారం దేవరకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో మున్సిపల్ లెవల్ సీఎం కప్ 2024 ఆటలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో గెలుపొ ందిన విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్ర మంలో దేవరకొండ సీఐ నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, ఎంపీడీవో డానియెల్, ఎంఈవో మాతృనాయక్, మున్సిపల్ ఏఈ రాజు, ఫిజికల్ డైరెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మండల ప్రత్యేకాధికారి నాగమల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో గురువారం మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాలబాలికలు, యువతి యువకులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీని వాస్‌రావు, ఉమ్మడి మండల ఎంఈవోలు వెంకటయ్య, సముద్రాల శ్రీనయ్య, పీడీలు సీహెచ్ ఎల్లయ్య రవీందర్, సునీత, మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి


హాలియా, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): : పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, పీఆర్సీ పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఈనెల 17న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద టీపీయూఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా ను విజయ వంతం చేయాలని తపస్ అనుముల మండలాధ్యక్షుడే రేణికుంట్ల రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం హాలియాలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనుముల ఎంఈవో గుండా కృష్ణమూర్తి, రాష్ట్ర బాధ్యులు గుర్రం ప్రభాకర్‌రెడ్డి, గుర్రం సత్యనారాయణ రెడ్డి, ప్రకాష్, అక్కయ్యబాబు, సుధాకర్‌రెడ్డి, పుష్పలత, జీతేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

పెండ్లిపాకల పూర్తయ్యేదెన్నడో?

(5వ పేజీ తరువాయి)

తవ్వాల్సి ఉంది. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న పెండ్లిపాకల ప్రాజెక్టు సామర్థ్యాన్ని 2.2 టీఎంసీలకు పెంచాలి. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెండ్లిపాకల ప్రాజెక్టులోకి భారీగా వరద చేరింది. ప్రాజెక్టు కట్ట దెబ్బతిని నీరు లీకయ్యే పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచితే కొండమల్లేపల్లి మండలం గుడితండా, కారోబార్‌తండా, హంక్యతండా, హరియతండాలు ముంపునకు గురికానున్నాయి. నీటిపారుదలశాఖ అధికారులు ఇప్పటికే భూసేకరణ చేపట్టారు. ప్రాజెక్టు కింద 2,700 ఎకరాల వరకు రైతులు భూములు కోల్పోతున్నారు. ఇప్పటికే 18వేల ఎకరాల వరకు భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం కూడా చెల్లించింది. ప్రస్తుతం నీటిపారుదలశాఖ అధికారులు భూసేకరణ, ముంపు గ్రామాలకు పునరావాసం కల్పించే పనిలో ఉన్నారు. ఇదిలా ఉండగా, ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల ఎత్తుపెంపు పనులు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం, పునరావాసం కల్పించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలి



ప్రాజెక్టు కింద ఐదు ఎకరాల భూమి కోల్పోతున్నా. సర్వే నిర్వహించి వెళ్లారు తప్ప పూర్తిస్థాయి పరిహారం ఇవ్వలేదు. ప్రాజెక్టు పనులు నిలిపివేశారు. వెంటనే పరిహారం అందజేసి పునరావాసం కల్పించి ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలి.

-రమావత్ లక్ష్మణ్‌నాయక్, గుడితండా

టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం

ఎస్ఎల్‌బీసీ ఓపెన్‌కెనాల్, పెండ్లిపాకల రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచే పనులకు ప్రభుత్వం రీటెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రాజెక్టు కింద భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాస ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో ప్రాజెక్టు పనులను తిరిగి ప్రారంభిస్తాం. -రమేష్, పెండ్లిపాకల ప్రాజెక్టు డీఈఈ